విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వ్యాప్తంగా వెలువడుతున్న తెలంగాణ సైన్యం దినపత్రికలో విలేకరులుగా పనిచేయుటకు బ్యూరో, మండలలా , జిల్లాల, నియోజకవర్గ స్థాయిల్లో ఉత్సహవంతులైన యువతి,యువకులు కావలెను. కొత్త వారికి మరియు అనుభవం ఉన్నవారికి అవకాశం ఇవ్వబడును.

9642631237



ప్రతి సిరా చుక్కలో చైతన్యం

# తెలంగాణ సైన్యం

డిజిటల్ తెలుగు దినపత్రిక

TS-34-0004749

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 01 సంచిక : 165, చీఫ్ ఎడిటర్ .. నవీన్ కుమార్. వెల రూ. 4 /- ఆదివారం 22-03-2026


## తెలుగు రాష్ట్రాల్లో కొండెక్కిన కోడి ధర..



ఒక్క రోజులోనే భారీగా ధరలు పెరగడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు.

విజయవాడలో స్కిన్ లెస్ చికెన్ కిలో ధర రూ. 380 నుండి రూ. 400 వరకు పలుకుతోంది.

హైదరాబాద్ లో కిలో చికెన్ రూ. 340 నుండి రూ. 350 మధ్య విక్రయిస్తున్నారు.

అమరావతి : తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ప్రియులకు ఆదివారం భోజనం భారంగా మారబోతోంది. నిన్నటి వరకు సాదాసీదాగా ఉన్న మిగతా..2లో

## భద్రాచలం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది: మంత్రి కొండా సురేఖ



భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మరియు పట్టణ సమగ్ర అభివృద్ధి పై మంత్రి కొండా సురేఖ సమీక్షా సమావేశం నిర్వహించారు.

హైదరాబాద్: భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం మరియు పట్టణ సమగ్ర అభివృద్ధి పై డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలోని తన చాంబర్లో రాష్ట్ర అటవీ, పర్యావరణ మరియు దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అధ్యక్షతన మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు, వాకిటి శ్రీహరి, ఎంపీ బలరాం నాయక్, ఎమ్మెల్యేలు తెల్లం వెంకట్రావు, జాటోత్ రామచంద్ర నాయక్ లతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. "భద్రాచలం పునర్నిర్మాణం మరియు పునరుజ్జీవనం" ప్రాజెక్టుకు సంబంధించిన ప్రణాళికల పై చర్చించారు. మిగతా..2లో

## కొండగట్టులో ప్రత్యేక పూజలు నిర్వహించిన బండి సంజయ్



- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు
- అంజన్న ఆశీర్వాద యాత్ర' ముగింపు సమయానికి ఆలయం మూసివేయడంతో, అప్పట్లో ఆయన ముఖద్వారం వద్దే మొక్కు తీర్చుకున్నారు.

జగిత్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కొండగట్టు అంజన్న సన్నిధిలో నేడు ఆధ్యాత్మిక కోలాహలం నెలకొంది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

### ఆరు గ్యారంటీల్లో అరగ్యారంటీ కూడా

# ఇప్పటివరకు అమలు కాలేదు

- బీఆర్ఎస్ సీనియర్ నేతలు, లీగల్ సెల్ విభాగంతో కేటీఆర్ సమావేశం
- ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత అంశంపై ప్రైవేట్ మెంబర్ బిల్లుపై చర్చ
- గ్యారంటీలకు చట్టబద్దత కోరుతూ ప్రైవేటు మెంబర్ ప్రవేశపెట్టనున్నామని వెల్లడి



హైదరాబాద్: ఆరు గ్యారంటీలపై సీఎం రేవంత్ రెడ్డి సంతకం చేసిన దస్త్రం కనిపించకుండా పోయిందన్న బీఆర్ఎస్ నేత కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం 4 కోట్ల మందికి టోపీ పెట్టిందని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ సీనియర్ నేతలు, లీగల్ సెల్ విభాగంతో కేటీఆర్ సమావేశం అయ్యారు. ఆరు గ్యారెంటీలకు చట్టబద్ధత అంశంపై ప్రైవేట్ మెంబర్ బిల్లుపై చర్చించారు. అనంతరం కేటీఆర్ మీడియా సమావేశంలో మాట్లాడారు. శుక్రవారమే ప్రైవేటు బిల్లు : సీఎం రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం రోజున 6 గ్యారంటీల దస్త్రంపై సంతకం చేశారని, అభయహస్తం అనే దస్త్రంపై రేవంత్ రెడ్డి తొలి సంతకం చేశారని కేటీఆర్ గుర్తు చేశారు. గవర్నర్ ప్రసంగంలోనూ ఆరు గ్యారంటీలపై సంతకం జరిగిందని చెప్పించారని, ఆరు గ్యారంటీల్లో అరగ్యారంటీ కూడా ఇప్పటివరకు అమలు కాలేదని విమర్శించారు. ఆరు గ్యారంటీలకు చట్టబద్దత కోరుతూ ప్రైవేటు మెంబర్ బిల్లు ప్రవేశపెట్టనున్నామని ప్రకటించారు. వచ్చే శుక్రవారం నాడు శాసనసభలో తాము ప్రైవేటు బిల్లు పెట్టాలని నిర్ణయించామని, తాము సభలో బిల్లు ప్రవేశపెట్టేలా అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను కోరుతున్నామని అన్నారు. కాంగ్రెస్ హామీ ఇచ్చిన అంశమే అయినందున మిగతా..2లో

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ

- జిల్లాలో సగం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని, మూడుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని మండిపడ్డారు.
- కానీ అదే కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ వాళ్లు కూలేశ్వరంగా అభివర్ణించారని మండిపడ్డారు.



హైదరాబాద్: సిద్దిపేట అభివృద్ధికి నిధులు రద్దు చేశారని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వివరణ ఇవ్వాలని బీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్ చేశారు. రేపు సిద్దిపేటలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించనున్నారు. ఈనేపథ్యంలో ఆయన పలు ప్రశ్నలతో బహిరంగ లేఖ రాశారు. సిద్దిపేటలో ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ నిర్మాణం తాము చేస్తే శిలాఫలకం మిగతా..2లో

## ఇరాన్ పై దాడులను ఖండించడంలో మోదీ సర్కార్ విఫలం- ఇది పిరికితనానికి, ద్రోహానికి నిదర్శనం



- ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా దాడులను ఖండించడంలో మోదీ ప్రభుత్వం విఫలం
- ఇది భారత నాగరికత విలువలకు ద్రోహం చేసినట్లే- కాంగ్రెస్ విమర్శలు

ఢిల్లీ : ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ లు చేస్తున్న దాడుల విషయంలో మోదీ సర్కార్ అనుసరిస్తున్న వైఖరిపై కాంగ్రెస్ తీవ్ర విమర్శలు గుప్పించింది. ఇరాన్ పై జరుగుతున్న వైమానిక దాడులను, ఆ దేశ అగ్రనేతల హత్యలను, అక్కడ బలవంతపు పాలనా మార్పు కోసం జరుగుతున్న ప్రయత్నాలను

## కేరళలో మరోసారి షిగెల్లా కలకలం 12మందికి పాజిటివ్

- ... పెరుగుతుండటంతో ప్రజల్లో ఆందోళన
- తాజాగా 12 మందికి వైరస్ సోకినట్టు వెల్లడి
- ఆరోగ్య శాఖ, గ్రామపంచాయతీ అప్రమత్తం- నివారణ చర్యలు ముమ్మరం



ఢిల్లీ : కేరళలోని కోజికోడ్ జిల్లాలో షిగెల్లా వ్యాధి కలకలం రేపుతోంది. పెరువయల్ గ్రామపంచాయతీ పరిధిలోని ఎరంజికల్ ప్రాంతంలో తాజాగా మరో 12 మందికి షిగెల్లా సోకినట్లు నిర్ధరణ కావడంతో స్థానిక ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే కొద్ది రోజుల క్రితం నలుగురికి ఈ వ్యాధి నిర్ధరణ కాగా, వారిలో ఒక చిన్నారి మృతి చెందడం పరిస్థితిని మరింత తీవ్రమయ్యేలా చేసింది. తాజాగా నమోదైన కేసులతో మొత్తం బాధితుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఆరోగ్య శాఖ తెలిపిన వివరాల ప్రకారం, కొత్తగా పాజిటివ్ వచ్చిన వారిలో చాలా మంది ఇప్పటికే బాధితులైన వారి కుటుంబ సభ్యులే. దీంతో వ్యాధి ఒకే ప్రాంతంలో వేగంగా వ్యాప్తి చెందుతున్నట్టు అధికారులు భావిస్తున్నారు. ఇదే నేపథ్యంలో ఆరోగ్య శాఖ, గ్రామపంచాయతీ యంత్రాంగం అప్రమత్తమై విస్తృత స్థాయిలో నివారణ చర్యలు చేపట్టింది. మిగతా..2లో

## స్వేచ్ఛా నౌకాయానం, సముద్ర మార్గాల భద్రత ముఖ్యం'

### ఇరాన్ అధ్యక్షుడితో ప్రధాని మోదీ

- ఇరాన్ అధ్యక్షుడు పెజిష్కియాన్ తో ఫోన్ లో మాట్లాడిన ప్రధాని మోదీ
- ఈద్ , నౌరోజ్ శుభాకాంక్షలు తెలిపిన పీఎం



ఢిల్లీ : పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్న వేళ ప్రధాని నరేంద్ర మోదీ శనివారం ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజిష్కియాన్ తో ఫోన్లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన ఇరాన్ అధ్యక్షుడికి ఈద్ , నౌరోజ్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. మిగతా..2లో

## తిరుమల శ్రీవారి సేవలో సీఎం చంద్రబాబు కుటుంబం



- దేవాన్ష్ పుట్టినప్పటి నుంచీ ఏటా ఒకరోజు అన్నప్రసాద వితరణ
- సామాన్య భక్తునిలా వైకుంఠ క్యూ కాంప్లెక్స్ నుంచి వెళ్లి దర్శించుకున్న సీఎం
- మొదట్నుంటీ క్యూ కాంప్లెక్సులో వెళ్లి దర్శించుకుంటున్న చంద్రబాబు

అమరావతి : ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల శ్రీవారి సేవలో పాల్గొన్నారు. సీఎం హోదాలో నేరుగా మహాద్వారం ద్వారా ఆలయంలోకి ప్రవేశించి శ్రీవారిని దర్శించుకునే అవకాశం ఉన్నా సామాన్య భక్తునిలా వైకుంఠ క్యూ కాంప్లెక్స్ నుంచి దర్శించుకున్నారు. అనంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రానికి వెళ్లి కుటుంబ సభ్యులతో కలిసి భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.


# ఇక టెన్త్ పరీక్షలు ఉండవు

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- విద్యావిధానంలో మార్పులు
- రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు
- ఫోన్ ట్యాపింగ్, జీవన్ రెడ్డి వ్యవహారంపై కూడా స్పందించిన ముఖ్యమంత్రి
- ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు కొనసాగుతాయన్న ముఖ్యమంత్రి
- విద్యా విధానంలో మార్పులు తెస్తున్నామని వెల్లడి
- జీవన్ రెడ్డి వ్యవహారాన్ని టీపీసీసీ చీఫ్, ఇంఛార్జ్ చూసుకుంటారని స్పష్టీకరణ



హైదరాబాద్ : ఫోన్ ట్యాపింగ్ అరెస్టులు, సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి వ్యవహారం, విద్యా విధానం అంశాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. మీడియాతో పిచ్చాపాటిగా మాట్లాడిన ఆయన, విద్యా విధానంలో కీలక మార్పులు తెస్తున్నామని స్పష్టం చేశారు. ఇక టెన్త్ పరీక్షలు ఉండవని చెప్పారు. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విధానం ఉంటుందని, దీనిని ముమ్ముందు అమలుచేస్తామని అన్నారు. మూసీ ప్రక్షాళన - మిగతా 2 లో

## ఏపీ సర్కార్ కీలక నిర్ణయం.. డెయిరీ, పశుసంవర్ధక ఫారాలకు భారీ ఊరట



- పశుసంవర్ధక రంగానికి ఏపీ సర్కార్ భారీ ఊరట కల్పించింది.
- పట్టణాల్లో పశుపోషకులకు అభివృద్ధి ఛార్జీల నుంచి మినహాయింపు నిచ్చింది.
- భవన అనుమతుల రుసుములో సడలింపులు చేసింది.

అమరావతి, మార్చి 21 : పశుసంవర్ధక రంగానికి ఏపీ సర్కార్ భారీ ఊరట కల్పించింది. పట్టణాల్లో పశుపోషకులకు అభివృద్ధి ఛార్జీల నుంచి మినహాయింపు నిచ్చింది. మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

# ఇక టెన్త్ పరీక్షలు ఉండవు

మొదటిపేజీ తరువాయి - ఆగదని, ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. జగిత్యాలకు చెందిన తమ పార్టీ సీనియర్ నాయకుడు జీవన్ రెడ్డి వ్యవహారాన్ని టీపీసీసీ అధ్యక్షుడు, పార్టీ వ్యవహారాల ఇన్‌ఛార్జ్ చూసుకుంటారని తెలిపారు.అటు, ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు కొనసాగుతాయని తెలిపారు. చట్టప్రకారమే ఈ దర్యాప్తు కొనసాగుతోందని అన్నారు. విద్యావిధానంలో మార్పులు చేస్తున్నామని, ఇక పదో తరగతి బోర్డు పరీక్షలు ఉండబోవని అన్నారు.ఫోన్ ట్యాపింగ్ కేసులో అరెస్టులు ఏవని విపక్షాలు ప్రశ్నిస్తుండటంపై కూడా ముఖ్యమంత్రి స్పందించారు. విచారణ జరపకుండానే అరెస్టులు చేయలేం కదా అన్నారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో కోర్టు క్లీన్ చిట్ ఇచ్చిందని హరీశ్ రావు అసత్య ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్ రావుకు సిద్దిపేటకు చెందిన చక్రధర్ కేసులోనే క్లీన్ చిట్ వచ్చిందని తెలిపారు.పదేళ్లు బీఆర్ఎస్ చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తున్నామని ముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. వాళ్లు చేసిన తప్పులకు చెవిలో పువ్వులు కాదని, వీపుపై బండలు పెట్టాలని అన్నారు. ఫార్ములా ఈ-రేసు కేసులో విచారణకు ఇటీవల కేంద్రం అనుమతి ఇచ్చిందని, ఇప్పటికే అరవింద్ కుమార్‌ను సస్పెండ్ చేశామని అన్నారు.

## ఏపీ పారిశ్రామిక రంగంలో మరో ముందడుగు

ఇది రాష్ట్ర చరిత్రలోనే అతిపెద్ద పారిశ్రామిక పెట్టుబడులలో ఒకటి. ఈ పరిశ్రమ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. నక్కపల్లి, పాయకరావుపేట, చుట్టుపక్కల ప్రాంతాల యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ఉక్కు కర్మాగారం వస్తే దానిపై ఆధారపడే వందలాది చిన్న తరహా పరిశ్రమలు చుట్టుపక్కల ఏర్పడతాయి. తద్వారా పరోక్ష ఉపాధి భారీగా పెరుగుతుంది. ఆర్సెలార్ మిట్టల్ - నిప్పాన్ స్టీల్ సంస్థలు ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తిని లక్ష్యంగా పెట్టుకున్నాయి. ఈ సంస్థలు అత్యంత ఆధునికమైన, పర్యావరణహితమైన సాంకేతికతను ఇక్కడ ఉపయోగించనున్నాయి.

### 23న భూమిపూజ..

ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర మంత్రులతో కలిసి ఈనెల 23వ తేదీన (సోమవారం) భూమిపూజ చేయనున్నారు. కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి, పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఇతర ముఖ్య నేతలు ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు.

### పారిశ్రామిక రంగంలో కొత్త అధ్యాయం..

గత 21 నెలలుగా ఏపీ ప్రభుత్వం చేపట్టిన పారిశ్రామిక విధానాలు, సులభతర వాణిజ్యం వేగవంతమైన అనుమతుల వల్లే ఈ ప్రాజెక్టు పట్టాలెక్కింది. విశాఖపట్నం పోర్టుకు సమీపంలో ఉండటంతో ముడిసరుకు రవాణా , ఎగుమతులకు ఈ ప్రాంతం వ్యూహాత్మకంగా చాలా కీలకం. ఈ ప్రాజెక్టు కేవలం ఒక ఫ్యాక్టరీ మాత్రమే కాదని, ఆంధ్రప్రదేశ్‌ను 'భారతదేశ ఉక్కు రాజధాని'గా మార్చే దిశగా వేసిన బలమైన అడుగని ప్రభుత్వ వర్గాలు పేర్కొన్నాయి.

## తెలుగు రాష్ట్రాల్లో కొండెక్కిన కోడి ధర..
## మధ్య తరగతి గుండెల్లో రైళ్లు!

కోడి మాంసం ధరలు ఒక్కసారిగా ఆకాశాన్ని తాకాయి. కేవలం ఒక్క రోజులోనే భారీగా ధరలు పెరగడంతో వినియోగదారులు బెంబేలెత్తుతున్నారు. ముఖ్యంగా ఏపీలో నిన్నటి కంటే ఈరోజు ఏకంగా రూ. 70 అదనంగా పెరగడం గమనార్హం. విజయవాడలో స్కిన్ లెస్ చికెన్ కిలో ధర రూ. 380 నుండి రూ. 400 వరకు పలుకుతోంది. హైదరాబాద్ లో కిలో చికెన్ రూ. 340 నుండి రూ. 350 మధ్య విక్రయిస్తున్నారు. అసలు దీని ధర అడిగితేనే గుండె జారిపోయేలా ఉంది. కిలో నాటుకోడి ఏకంగా రూ. 800 పలుకుతోంది. అంటే దాదాపు మటన్ ధరతో పోటీ పడుతోంది. వ్యాపారులు మరియు పౌల్ట్రీ రైతుల విశ్లేషణ ప్రకారం ఈ పెరుగుదల వెనుక ఐదు కీలక కారణాలు ఉన్నాయి. తీవ్రమైన ఎండల వల్ల కోళ్లు పెద్ద సంఖ్యలో మృత్యువాత పడుతున్నాయి. దీంతో మార్కెట్‌లోకి రావాల్సిన సప్లై గణనీయంగా తగ్గింది. ప్రస్తుతం రంజాన్ పండుగ కావడంతో చికెన్ వినియోగం విపరీతంగా పెరిగింది. పెళ్లిళ్లు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలు ఎక్కువగా ఉండటంతో డిమాండ్ రెట్టింపయింది. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల వల్ల రవాణా ఖర్చులు పెరిగాయి. అలాగే కోళ్లకు వేసే దానా ధరలు కూడా పెరగడంతో పౌల్ట్రీ రైతులు రేట్లు పెంచక తప్పడం లేదు.

## ఏపీ సర్కార్ కీలక నిర్ణయం..
## డెయిరీ, పశుసంవర్ధక ఫారాలకు భారీ ఊరట

భవన అనుమతుల రుసుములో సర్కార్ సడలింపులు చేసింది. ఈ సందర్భంగా అమరావతిలోని సచివాలయంలో ఏపీ వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఈరోజు(శనివారం) మాట్లాడారు. రాష్ట్రంలో పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేస్తూ పశుపోషకులు, చిన్నరైతులకు పెద్దఎత్తున ఊరటనిచ్చేలా నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. ఏపీలోని పట్టణ స్థానిక సంస్థలు, పట్టణ అభివృద్ధి సంస్థలు పరిధిలో డెయిరీ ఫారాలు, గొర్రెలు/మేకల పెంపకం కేంద్రాలు, పందుల పెంపకం యూనిట్లు, ఇతర పశుసంవర్ధక ఫారాలకు బెటర్‌మెంట్, డెవలప్‌మెంట్ చార్జీలు మినహాయింపు ఇచ్చినట్లు స్పష్టం చేశారు. ఈ ఫారాలకు భవన అనుమతి/లైసెన్స్ రుసుమును గ్రామ పంచాయతీల్లో వసూలు చేసే రుసుముకు సమానంగా నిర్ణయించినట్లు తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా పట్టణ ప్రాంతాల్లో పశుపోషణపై ఆధారపడిన రైతులు, చిన్న వ్యవసాయదారులకు ఆర్థిక భారం గణనీయంగా తగ్గే అవకాశం ఉందని చెప్పుకొచ్చారు. దీంతో మరింత మందికి స్వయం ఉపాధి, సంవృద్ధి లభిస్తుందని వెల్లడించారు. గత జూన్‌లో జరిగిన సీఎం కాంక్లేవ్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన హామీని అమలు చేస్తూ ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

## ఆరు గ్యారంటీల్లో అరగ్యారంటీ
## కూడా ఇప్పటివరకు అమలు కాలేదు

ఆ పార్టీ కూడా బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరారు. ఎమ్మెల్యేలపై ఒత్తిడి తేవాలి : మహిళలకు నెలకు రూ.2500 ఇస్తామన్నారని, వెంటనే అమలు చేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పింఛను రూ.2 వేల నుంచి రూ.4 వేలకు పెంచుతామన్నారని, వెంటనే పెంచాలని అన్నారు. విద్యార్థులకు విద్యా భరోసా కార్డులు ఇస్తామన్నారని, వెంటనే ఇవ్వాలని, కౌలు రైతులకు రూ.15 వేలు ఇస్తామన్నారని, అదీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తాము పెట్టే బిల్లు పాస్ అయితే హామీలన్నీ చట్ట ప్రకారంగా అమలవుతాయని స్పష్టం చేశారు. తాము పెట్టే బిల్లుకు మద్దతు ఇవ్వాలని ప్రజలు వారి ఎమ్మెల్యేలపై ఒత్తిడి తేవాలని కోరారు. "వచ్చే శుక్రవారం నాడు శాసనసభలో మేము ప్రైవేటు బిల్లు పెట్టాలని నిర్ణయించాం. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత కోరుతూ ప్రైవేటు మెంబర్ ప్రవేశపెట్టనున్నాం. మేము సభలో బిల్లు ప్రవేశపెట్టేలా అనుమతి ఇవ్వాలని స్పీకర్‌ను కోరుతున్నాం. కాంగ్రెస్ హామీ ఇచ్చిన అంశమే కాబట్టి ఆ పార్టీ కూడా బిల్లుకు మద్దతు ఇవ్వాలి. ఆరు గ్యారంటీలపై సీఎం సంతకం చేసిన దస్త్రం కనిపించకుండా పోయింది రేవంత్ రెడ్డి ప్రమాణస్వీకారం రోజున 6 గ్యారంటీల దస్త్రంపై సంతకం చేశారు. అభయహస్తం అనే దస్త్రంపై సీఎం రేవంత్‌రెడ్డి తొలి సంతకం చేశారు. గవర్నర్ ప్రసంగంలోనూ ఆరు గ్యారంటీలపై సంతకం జరిగిందని చెప్పించారు. ఆరు గ్యారంటీల్లో అరగ్యారంటీ కూడా ఇప్పటివరకు అమలు కాలేదు"

## కొండగట్టులో ప్రత్యేక పూజలు
## నిర్వహించిన బండి సంజయ్

గత శనివారం నిర్వహించిన 'అంజన్న ఆశీర్వాద యాత్ర' ముగింపు సమయానికి ఆలయం మూసివేయడంతో, అప్పట్లో ఆయన ముఖద్వారం వద్దే మొక్కు తీర్చుకున్నారు. ఆ వెలితిని పూడ్చుకుంటూ నేడు మళ్ళీ ఆలయానికి విచ్చేశారు. అర్చకులు, అధికారులు ఆయనకు ఘనస్వాగతం పలికారు. గర్భాలయంలో పూజల అనంతరం బండి సంజయ్‌ను శాలువాతో సన్మానించి ఆశీర్వచనాలు, ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ మేయర్ సునీల్ రావు, బీజేపీ నేతలు ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, భారీ సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. భక్తుల రద్దీతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది.

# తిరుమల శ్రీవారి సేవలో సీఎం చంద్రబాబు కుటుంబం

మొదటి పేజి తరువాయి

ఆ తర్వాత సీఎం కూడా శ్రీవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. మనవడు దేవాంశ్ పుట్టినరోజు సందర్భంగా కుటుంబసభ్యులతో కలిసి సీఎం శ్రీవారి సేవలో పాల్గొన్నారు. ఆలయానికి చేరుకున్న సీఎంకు ఆలయ ఈవో, అర్చకులు మహాద్వారం వద్ద ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. సతీమణి భువనేశ్వరి, కుమారుడు లోకేశ్, మనుమడు దేవాంశ్ తో కలిసి ఆలయం లోనికి వెళ్లిన సీఎం శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయకుల మండపంలో చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులకు పండితుల వేదాశీర్వచనాలు చేశారు. అనంతరం అర్చకులు శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు. దేవుని ముందు అందరూ సమానమే: శ్రీవారి పాదాల చెంత పుట్టానని, ఆయన కటాక్షం వల్లే తనకు పునర్జన్మ లభించిందని బహిరంగంగా ప్రకటిస్తూ తన ఇలవేల్పుపై భక్తిభావాలను చాటుకునే సీఎం చంద్రబాబు, భక్తిని మాటల్లోనే కాదు, ఆచరణలోనూ చూపుతున్నారు. ముఖ్యమంత్రి హోదాలో ఉన్నవారికి తిరుమలలో ప్రోటోకాల్ ప్రకారం మహాద్వారం నుంచి నేరుగా ఆలయ ప్రవేశానికి అవకాశం ఉంది. కానీ దేవుని ముందు అందరూ సమానమేనన్న భావనతో చంద్రబాబు ముఖ్యమంత్రి హోదాలో తిరుమలకు వచ్చినా క్యూ కాంప్లెక్స్ ద్వారా వెళ్లి శ్రీవారిని దర్శించుకుంటున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రభుత్వం తరపున పట్టు వస్త్రాలు సమర్పించే సమయంలో మినహా తిరుమల వచ్చిన ప్రతిసారీ కుటుంబసమేతంగా క్యూలైన్ ద్వారానే వెళ్లి స్వామివారిని



దర్శించుకుంటున్నారు. తొలిసారి సీఎంగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచీ ఇదే సంప్రదాయాన్ని పాటిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలన: క్యూ కాంప్లెక్స్ నుంచి దర్శనానికి వెళ్లడం ద్వారా శ్రీవారిపై తనకున్న భక్తిభావాన్ని చాటడంతో పాటు సామాన్య భక్తులకు టీటీడీ కల్పిస్తున్న సౌకర్యాలనూ గమనిస్తూ సీఎంగా తన బాధ్యతలను చంద్రబాబు నెరవేరుస్తున్నారు. క్యూ కాంప్లెక్స్‌లో ప్రసాదం పంపిణీ, తాగునీటి సదుపాయం, పారిశుద్ధ్యం వంటి అంశాలు ఎలా ఉన్నాయో క్షేత్రస్థాయిలో పరిశీలిస్తూ లోపాలు కనిపిస్తే వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచనలు చేస్తారు. తిరుమల కొండపై భక్తుల ఆకలి తీర్చే అన్నదాన కార్యక్రమానికి ఏటా విరాళం అందజేస్తూ చంద్రబాబు కుటుంబం దాతృత్వం చాటుకుంటోంది. 1985లో ఎన్టీఆర్ హయాంలో 2 వేల మందితో ప్రారంభమైన అన్నదానం 1994లో ఎన్టీఆర్ నిత్య అన్నదాన ట్రస్టుగా రూపాంతరం చెంది, తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్స్ ద్వారా, నిత్యం వేలాది మంది భక్తుల కడుపు నింపుతోంది. ఈ ప్రతిష్ఠాత్మక ట్రస్టుకు సీఎం చంద్రబాబు తన మనవడు దేవాన్ష్ పుట్టినప్పటి నుంచీ ఒక ఏడాది మినహా 11 సార్లు ఒక రోజు అన్నదాన వ్యయాన్ని విరాళంగా అందజేస్తున్నారు. 11 సార్లు: 2015, 2016 సంవత్సరాల్లో రూ. 20 లక్షలు, 2017లో రూ. 25 లక్షలు, 2018లో రూ.26 లక్షలు, 2019 నుంచి 2021 వరకు రూ. 30 లక్షలు, 2023లో రూ.33 లక్షలు, 2024లో రూ.38 లక్షలు, 2025, 2026 సంవత్సరాల్లో రూ. 44 లక్షల రూపాయల చొప్పున దేవాంశ్ పేరుతో అన్నదానం కోసం విరాళం అందజేశారు. ఇలా మొత్తం 11 సార్లు 3 కోట్ల 40 లక్షల రూపాయలు విరాళంగా అందజేసి స్వామివారిపై తమ కుటుంబానికి ఉన్న అపారమైన భక్తిని చాటుకున్నారు. మనవడు దేవాంశ్ పుట్టినరోజు సందర్భంగా ఈ ఉదయం తిరుమల శ్రీవారిని సీఎం చంద్రబాబు కుటుంబ సమేతంగా దర్శించుకోనున్నారు. దర్శనానంతరం మాతృశ్రీ తరిగొండ వెంగమాంబ అన్నదాన సత్రానికి చేరుకొని భక్తులకు అన్నప్రసాద వితరణ చేయనున్నారు. అనంతరం తిరుమలలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ (ఐసీసీసీ) ని సందర్శించనున్నారు.

ప్రతీ ఏటా విరాళం:

ఎన్టీఆర్ హయాంలో తిరుమలలో ఏర్పాటు చేసిన అన్నదానం ట్రస్టు తిరుమల కొండకు వచ్చే భక్తులకు అన్నప్రసాదంతో ఆకలి తీరుస్తూనే ఉంది. తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం కాంప్లెక్సులో నిత్యం భక్తులకు అన్నప్రసాద వితరణ జరుగుతూనే ఉంటుంది. ఈ ట్రస్టుకు తన మనవడు దేవాంశ్ పుట్టినప్పటి నుంచీ ప్రతి ఏడాదీ విరాళాన్ని సీఎం చంద్రబాబు అందిస్తున్నారు. దేవాంశ్ పేరుతో అన్నదానం కోసం 12 సార్లు విరాళం అందించారు.

# 'స్వేచ్ఛా నౌకాయానం, సముద్ర మార్గాల భద్రత ముఖ్యం'

మొదటి పేజి తరువాయి

ఈ పండుగ సీజన్ పశ్చిమాసియాలో శాంతి, స్థిరత్వం, శ్రేయస్సు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ పశ్చిమాసియాలోని కీలక మౌలిక సదుపాయాలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. ఇలాంటి దాడులు ప్రాంతీయ స్థిరత్వానికి ముప్పు కలిగిస్తాయని, ప్రపంచ సరఫరా గొలుసులను దెబ్బతీస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. అంతర్జాతీయ నౌకాయాన స్వేచ్ఛను కాపాడడం, సముద్ర రవాణా మార్గాలను సురక్షితంగా ఉంచడం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. అంతేకాదు ఇరాన్ లో ఉన్న భారత పౌరుల భద్రతకు సంబంధించి అక్కడి ప్రభుత్వం అందిస్తున్న నిరంతర సహకారానికి ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. "ఇరాన్ అధ్యక్షుడు డాక్టర్ మసూద్ పెజెస్కియాన్ తో మాట్లాడి ఈద్ , నౌరోజ్ శుభాకాంక్షలు తెలియజేశాను. ఈ పండుగలు పశ్చిమాసియాలో శాంతిని నెలకొల్పుతాయని ఆశిస్తున్నాను. ప్రాంతీయ స్థిరత్వాన్ని దెబ్బతీసే మౌలిక సదుపాయాలపై దాడులను ఖండించాను."

– ప్రధాని మోదీ, ఎక్స్ పోస్టు

దౌత్య సంబంధాలు పై అమెరికా, ఇజ్రాయెల్ లు దాడులు చేయడంతో పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైంది. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఇరాన్ అధ్యక్షుడితో మోదీ మాట్లాడడం ఇదే రెండోసారి. అంతకు ముందు మార్చి 12న ఇరువురు నేతలు మాట్లాడుకున్నారు.



అప్పుడు ఇరాన్ అధ్యక్షుడు యుద్ధ పరిస్థితుల గురించి వివరించారు. అయితే భారత్ మొదటి నుంచి అన్ని సమస్యలను చర్చలు, దౌత్యం ద్వారానే పరిష్కరించుకోవాలని, ఇదే తమ స్థిరమైన విధానమని స్పష్టం చేస్తూ వస్తోంది. వాస్తవానికి పశ్చిమాసియా సంక్షోభం మొదలైనప్పటి నుంచి ప్రధాని మోదీ - సౌదీ అరేబియా, యూఏఈ, ఖతార్ , బహ్రెయిన్, కువైట్, జోర్డాన్ , ఫ్రాన్స్ , మలేషియా తదితర దేశాల నాయకులతో సంప్రదింపులు జరిపారు.

వార్ ఎఫెక్ట్

గత మూడు వారాలుగా ఇరాన్ వర్సెస్ అమెరికా, ఇజ్రాయెల్ ల మధ్య దాడులు, ప్రతిదాడులు నిరంతరాయంగా కొనసాగుతూ ఉన్నాయి. ముఖ్యంగా ఇరాన్ ప్రతీకార దాడులకు దిగి ఇజ్రాయెల్ తో సహా, తన పొరుగు దేశాల్లో ఉన్న అమెరికన్ మిలటరీ బేస్ లను లక్ష్యంగా చేసుకొని దాడులు చేస్తోంది. అంతేకాదు ప్రపంచ చమురు రవాణాలో దాదాపు 20 శాతం మేర జరిగే హర్మూజ్ జలసంధిని తన నియంత్రణలోకి తీసుకుంది. దీనితో ప్రపంచవ్యాప్తంగా చమురు సహ మిగతా ఇంధన సమస్యలు మొదలయ్యాయి. ఈ నేపథ్యంలో ఇరాన్ కొన్ని ఎంచుకున్న చమురు నౌకలను మాత్రమే హర్మూజ్ గుండా వెళ్లేందుకు అనుమతి ఇస్తోంది.


### ఇరాన్ ప్రస్తుత పరిస్థితి ఏమిటి?

అలీ ఖమేనీ మృతి తర్వాత, ఆయన కుమారుడు మొజ్తబా ఖమేనీ ఇరాన్ సుప్రీం లీడర్ గా ఎన్నికయ్యారు. ఆయన కూడా యుద్ధ రంగంలో తగ్గేది లేదంటున్నారు. అందుకే అమెరికా, ఇజ్రాయెల్ పై ప్రతీకార దాడులు కొనసాగిస్తున్నారు. దీనితో యుద్ధం మరింత తీవ్రమవుతోంది. మరోవైపు ఇరాన్ లోని అత్యంత కీలకమైన నతాంజ్ యురేనియం శుద్ధి కేంద్రంపై అమెరికా, ఇజ్రాయెల్ లో సంయుక్తంగా వైమానిక దాడులు జరిపాయి. ఈ విషయాన్ని ఇరాన్ ప్రభుత్వ వార్తా సంస్థ తస్నిమ్ ధ్రువీకరించింది. అయితే ఈ దాడి తర్వాత ఎలాంటి రేడియోధార్మిక పదార్థాలు వెలువడలేదని పేర్కొంది. కనుక అణుకేంద్రం సమీపంలో నివసించే ప్రజలకు ఎలాంటి ముప్పు లేదని అధికారులు తెలిపారు. ఇంతకు ముందు అంటే గురువారం ప్రపంచంలోనే అతిపెద్ద గ్యాస్ ద్రవీకరణ కేంద్రమైన ఖతార్‌లోని రాస్ లఫ్ఫాన్ పారిశ్రామిక నగరంపై ఇరాన్ బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. దీనితో తమ దేశ ఎల్ఎన్‌జీ ఎగుమతి సామర్థ్యం 17 శాతం మేర పడిపోయిందని, తమకు భారీ నష్టం వాటిల్లిందని ఖతార్ రక్షణ మంత్రిత్వశాఖ పేర్కొంది.

# కేరళలో మరోసారి షిగెల్లా కలకలం- 12మందికి పాజిటివ్

మొదటి పేజి తరువాయి

ఎరంజికల్, పూవట్టుపరంబ ప్రాంతాలతో పాటు పరిసర ప్రాంతాల్లో ప్రత్యేక చర్యలు కొనసాగుతున్నాయి. అనుమానిత లక్షణాలు ఉన్న వారిని గుర్తించేందుకు మెడికల్ టీంలు ఇంటింటికీ వెళ్లి పరిశీలనలు నిర్వహిస్తున్నాయి. లక్షణాలు కనిపిస్తున్న వారిని వెంటనే ఆసుపత్రులకు తరలించే ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే మరికొంతమంది అనుమానితులను ఆసుపత్రుల్లో చేర్చి, వారి నమూనాలను సేకరించి పరీక్షలు చేస్తున్నారు. వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు ఆశా వర్కర్ల ఆధ్వర్యంలో ఇంటింటికీ బావుల క్లోరినేషన్ కార్యక్రమం చేపట్టారు. తాగునీటి వనరులను శుభ్రపరిచే పనులు వేగవంతం చేశారు. అదనంగా, ఆహార భద్రతా శాఖ అధికారులు రంగంలోకి దిగారు. పరిశుభ్రత లేని పరిస్థితుల్లో పనిచేస్తున్న మూడు ఆహార దుకాణాలను మూసివేయాలని ఆదేశించారు. ప్రజలకు సురక్షితమైన ఆహారం, తాగునీరు అందేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకుంటున్నారు. ఈ పరిస్థితిపై పెరువయల్ గ్రామపంచాయతీ అధ్యక్షుడు ఆర్‌వీ జాఫర్ స్పందిస్తూ, షిగెల్లా కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అత్యవసర సమావేశాలు నిర్వహించినట్టు తెలిపారు. ఈద్ రోజున కూడా ఆరోగ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లతో కలిసి సమావేశమై చర్యలను సమీక్షించినట్టు చెప్పారు. పంచాయతీ పరిధిలోని అన్ని వార్డుల్లో కూడా క్లోరినేషన్ పూర్తి చేసినట్టు వెల్లడించారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టినట్టు అధికారులు తెలిపారు. మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి, వ్యాధి లక్షణాలు, నివారణ చర్యలపై వివరాలు అందిస్తున్నారు. జ్వరము, విరేచనాలు, వాంతులు వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఇదిలా ఉండగా, వ్యాధి వ్యాప్తికి అసలు కారణాలను తెలుసుకునేందుకు అధికారులు దర్యాప్తు ప్రారంభించారు. ముఖ్యంగా తాగునీటి వనరుల నుంచి నమూనాలు సేకరించి పరీక్షలు నిర్వహిస్తున్నారు. పిల్లలు కూడా బాధితుల్లో ఉండటంతో ఆరోగ్య శాఖ మరింత జాగ్రత్తలు తీసుకుంటోంది. గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో రాపిడ్ రెస్పాన్స్ టీమ్ ఏర్పాటు చేసి, పరిస్థితిని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో బాధితులను వెంటనే ఆసుపత్రులకు తరలించేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం చేపట్టిన చర్యలతో వ్యాధి వ్యాప్తిని త్వరలోనే



అదుపులోకి తీసుకురాగలమనే ఆశాభావాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, పరిశుభ్రత పాటిస్తే షిగెల్లా వ్యాధిని సమర్థంగా నివారించవచ్చని ఆరోగ్య శాఖ సూచిస్తోంది.గెల్లా అంటే ఏంటి అసలు? షిగెల్లా అనేది బాక్టీరియా (సూక్ష్మక్రిములు) వల్ల కలిగే ఒక రకమైన అంటువ్యాధి, దీనిని షిగెల్లోసిస్ అని కూడా పిలుస్తారు. ఇది ప్రధానంగా జీర్ణవ్యవస్థను, ముఖ్యంగా ప్రేగులను ప్రభావితం చేస్తుంది. ఈ ఇన్ఫెక్షన్ గురించి కొన్ని ముఖ్యమైన విషయాలు:

# ఇరాన్ పై దాడులను ఖండించడంలో మోదీ సర్కార్ విఫలం- ఇది పిరికితనానికి, ద్రోహానికి నిదర్శనం

మొదటి పేజి తరువాయి

అడ్డుకోవడంలో మోదీ సర్కార్ పూర్తిగా విఫలమైందని విమర్శించింది. దాడులను ఖండించకపోవడం నైతిక పిరికితనానికి చిహ్నామని, భారత నాగరికత విలువలకు ద్రోహం చేయడమేనని పేర్కొంది. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ శనివారం ఎక్స్ వేదికగా మోదీ సర్కార్ పై విరుచుకుపడ్డారు. "ప్రధాని మోదీ తనకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహులతో గొప్ప స్నేహం ఉందని చెప్పుకుంటారు. మరి ఆ గొప్ప స్నేహాన్ని ఉపయోగించి, యుద్ధాన్ని ఆపడానికి మోదీ ఎందుకు చొరవ తీసుకోవడం లేదు" అని ప్రశ్నించారు. "ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులు ప్రారంభమై సరిగ్గా 21 రోజులు లేదా మూడు వారాలు అవుతోంది. ప్రధాని మోదీ తన ఆర్భాటపు ఇజ్రాయెల్ పర్యటన ముగించుకుని, తిరిగి భారత్ కు వచ్చి కూడ 23 రోజులైంది. కానీ, ప్రస్తుతం భారత్ లో సహా ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక అస్థిరతకు దారితీసిన అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడులను మోదీ సర్కార్ ఖండించిందా? కనీసం విమర్శించిందా? అంటే, దానికి సమాధానం లేదు (నో). పోనీ అమెరికా-ఇజ్రాయెల్ లో ఇరాన్ అగ్రనేతలను లక్ష్యంగా చేసుకొని హత్యలు చేస్తోంది. కనీసం మోదీ ప్రభుత్వం ఆ హత్యలను ఖండించిందా? అంటే, దానికి కూడా సమాధానం లేదు (నో). ఇరాన్ లో అంతర్యుద్ధం వచ్చేలా, అక్కడి



ప్రభుత్వాన్ని కూల్చేసి దేశాన్ని విచ్ఛిన్నం చేయడానికి అమెరికా, ఇజ్రాయెల్ చేస్తున్న క్రూరమైన ప్రయత్నాలను మోదీ సర్కార్ విమర్శించిందా? అంటే, దానికి సమాధానం లేదు (నో). పోనీ ఇరాన్ పై చేస్తున్న బాంబు దాడులను, అలాగే గల్ఫ్ దేశాల్లోని ఇంధన, ఇతర మౌలిక సదుపాయాలపై ఇరాన్ చేస్తున్న దాడులను వెంటనే నిలిపివేయాలని చెబుతూ, మోదీ ప్రభుత్వం ఏమైనా దౌత్యప్రయత్నాలు చేసిందా? ఏమైనా చొరవ తీసుకుందా? కాల్పుల విరమణ కోసం ప్రధాని మోదీ తన స్నేహాన్ని ఉపయోగించారా? అంటే, దానికి సమాధానం లేదు (నో). ఈ నాలుగు 'నో'లు మోదీ ప్రభుత్వ నైతిక పిరికితనాన్ని, భారత నాగరికత విలువల పట్ల చేస్తున్న రాజకీయ ద్రోహాన్ని ప్రతిబింబిస్తున్నాయి."

**- జైరాం రమేశ్, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి (కమ్యునికేషన్స్ ) ఎక్స్ పోస్ట్**

మరింత తీవ్రమవుతున్న యుద్ధం

గత మూడు వారాలుగా కొనసాగుతున్న పశ్చిమాసియా ఉద్రిక్తతలు ఏమాత్రం తగ్గే సూచనలు కనిపించడం లేదు. శనివారం తెల్లవారు జామున కూడా ఇరాన్ తమపై క్షిపణులు ప్రయోగించిందని ఇజ్రాయెల్ పేర్కొంది. మరోవైపు, తమ ప్రధాన చమురు కేంద్రాలు ఉన్న తూర్పు ప్రాంతంలో కేవలం 2 గంటల వ్యవధిలో 20 డ్రోన్ లను కూల్చివేసినట్లు సౌదీ అరేబియా వెల్లడించింది. మరోవైపు ఇరాన్ కూడా ఏమాత్రం వెనక్కు తగ్గడం లేదు. ఇప్పటికే గల్ఫ్ దేశాల్లోని ఇంధన కేంద్రాలపై దాడులు చేస్తున్న ఇరాన్ , ఇకపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న పర్యాటక ప్రాంతాలపై కూడా దాడులు చేస్తామని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో, అమెరికా మరిన్ని యుద్ధ నౌకలను, మరో 2500 మెరైన్స్ ను పశ్చిమాసియాలో మోహరిస్తోంది. కాగా, ఇప్పటి వరకు జరిగిన యుద్ధం వల్ల ఇరాన్ లో 1300 మందికి పైగా, లెబనాన్ లో 1000 మందికి పైగా, ఇజ్రాయెల్ లో 15 మంది, అమెరికాకు చెందిన 13 మంది సైనికులు మరణించారు. లెబనాన్ , ఇరాన్ ల్లో లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులయ్యారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి హరీశ్ రావు బహిరంగ లేఖ

మొదటి పేజి తరువాయి

మీది ఎందుకని ప్రశ్నించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రావడానికికంటే ముందు జిల్లాకు రద్దు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన రూ.1,070 కోట్ల నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో సగం మంది రైతులకు రుణమాఫీ జరగలేదని, మూడుసార్లు రైతు భరోసా ఎగ్గొట్టారని మండిపడ్డారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన 27 నెలల తర్వాత సిద్దిపేటకు వస్తున్నారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సిద్దిపేట నియోజకవర్గం లేదన్నట్లుగా ఇన్నాళ్లు వ్యవహరించారని విమర్శించారు. ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రారంభం పేరిట సిద్దిపేటలో అడుగుపెడుతున్న ముఖ్యమంత్రికి తాను పలు ప్రశ్నలు సంధించదలుచుకున్నానని అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రతిఫలమే ఈ పామాయిల్ ఫ్యాక్టరీ అని పేర్కొన్నారు. కానీ అదే కాళేశ్వరం ప్రాజెక్టును కాంగ్రెస్ వాళ్లు కూలేశ్వరంగా అభివర్ణించారని మండిపడ్డారు. ఇక్కడ ఫ్యాక్టరీ ఏర్పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో చేసిన కృషి ఫలితమే అన్నారు. ఫ్యాక్టరీ ఏర్పాటు, పామాయిల్ తోటల సాగులో కాంగ్రెస్ ప్రభుత్వం చేసింది శూన్యమని విమర్శించారు. 2021 జూన్ 5న తొలి పామాయిల్ మొక్కను నాటింది తానేనని వెల్లడించారు. 2022 జనవరి 12వ తేదీన 62 ఎకరాల భూమి కేటాయించి, మార్చి 4న భూమికి ఫెన్సింగ్ పనులు మరియు స్టోరేజ్ వాటర్ రిజర్వాయర్‌ను ప్రారంభించామని తెలిపారు 2023 ఏప్రిల్ 4న ఫ్యాక్టరీకి పునాదిరాయి వేసి పనులు ప్రారంభించామని అన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీ నిర్మాణంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం పాత్ర కొండంత అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం పాత్ర గోరంత కూడా లేదని అన్నారు. ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన వెంటనే సిద్దిపేట నియోజకవర్గ అభివృద్ధి పనులకు సంబంధించి రూ.1,070 కోట్ల నిధులను అర్ధాంతరంగా రద్దు చేశారని ఆరోపించారు. నిధులను రద్దు చేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రేపు అధికారిక పర్యటన చేస్తున్నందున, ఆ నిధులన్నీ తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేశారు. సిద్దిపేట నియోజకవర్గంలో 22 వేల మందికి పైగా రైతులకు రుణమాఫీ కాలేదని తెలిపారు. రూ.170 కోట్ల మేర రైతు భరోసా నిధులు రాలేదని, వాటిని రేపు ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలో మంజూరై, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రద్దయి ఆగిపోయిన పనుల జాబితాను ఆయన పేర్కొన్నారు. రంగనాయకసాగర్ టూరిజం, కోమటిచెరువు శిల్పారామం, సిద్దిపేట నియోజకవర్గ ఔటర్ రింగు రోడ్డు, తోర్నాలలో బీఎస్సీ అగ్రికల్చర్ కళాశాల, మిట్టపల్లిలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల భవనం, సిద్దిపేటలో క్రీడాకారుల కోసం స్పోర్ట్స్ హబ్, టు టౌన్ పోలీస్‌స్టేషన్ భవనం, త్రీ టౌన్ పోలీస్‌స్టేషన్ భవనం, సిద్దిపేట-ఇల్లంతకుంట ఫోర్‌లేన్ రోడ్డు, సిద్దిపేట-కిష్టాపూర్ రహదారి, సిద్దిపేటలో మల్టీపర్పస్ ఆడిటోరియం, సిద్దిపేట బ్లాక్ ఆఫీస్ సమీపంలో ఇంటిగ్రేటెడ్ వెజ్ మరియు నాన్ వెజ్ మార్కెట్ ఆగిపోయాయని అన్నారు.

## నర్వలో ఘనంగా ఈద్-ఉల్-ఫితర్ వేడుకలు
### – సోదరభావానికి ప్రతీకగా పండుగ సంబరాలు



**నర్వ, మార్చి 21, తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** నర్వ మండల కేంద్రంలో పవిత్ర ఈద్-ఉల్-ఫితర్ (రంజాన్) పండుగను ఎంతో ఘనంగా, ఆనందోత్సాహాలతో జరుపుకున్నారు. పవిత్ర రంజాన్ మాసం ముగిసిన సందర్భంగా ముస్లిం సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక నమాజ్‌లు నిర్వహించారు.మసీదులో అత్తరు పరిమళాలు, సుర్మా సుగంధాలు వ్యాపించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించగా, "ఈద్ ముబారక్" శుభాకాంక్షలతో ప్రాంతమంతా పండుగ వాతావరణం నెలకొంది.చిన్నా పెద్దా తేడా లేకుండా అందరూ పరస్పరం ఆలింగనం చేసుకుని సోదరభావాన్ని చాటుకున్నారు.ఈ సందర్భంగా సమాజంలో ఐక్యత, సౌభ్రాతృత్వం, దయ, దాన ధర్మాల ప్రాముఖ్యతను పెద్దలు వివరించారు. ఇళ్లలో ప్రత్యేక వంటకాలు సిద్ధం చేసి కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా పండుగను జరుపుకున్నారు.కార్యక్రమంలో ఇమామ్ సబ్ అఫ్సర్ మరియు నర్వ జామ మజీద్ సదర్ సాబ్ సాహెబ్ హుస్సేన్‌లను కమిటీ సభ్యులు, యువకులు సత్కరించారు.ఈ వేడుకల్లో మౌలానా అఫ్సర్ రజా, సదర్ సబ్ సాహెబ్ హుస్సేన్, బాబుమియా (లంకల), సలీం సాబ్, మౌలాలి (టైలర్), ఫజల్, రఫీక్, జంగీర్, ఇక్బాల్, కుర్షిత్, కాజా పటేల్, రియాజ్ తదితరులు పాల్గొని పండుగకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు.

## ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రంజాన్ శుభాకాంక్షలు



**మేడ్చల్ ,మార్చి 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా గ్రామంలో ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించబడింది.ఈ సందర్భంగా ఆర్ ఆర్ ఫౌండేషన్ చైర్మన్ రామన్న గారి రాఘవేందర్ గౌడ్ మైనార్టీ సోదరుల ఇళ్లకు వెళ్లి రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీకగా నిలిచే రంజాన్ పండుగను ప్రతి ఒక్కరూ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ముస్లిం సోదరులతో కలసి పండుగ సంతోషాన్ని పంచుకోవడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు మరియు ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

## నిరాహార దీక్షకు తరలిరావాలి ఎమ్మార్పీఎస్ పిలుపు
### -మార్చి 30న ఇంద్ర పార్క్‌లో నిరాహార దీక్షకు భారీ ఏర్పాట్లు



**పెద్ద కొడప్‌గల్,మార్చి 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** కామారెడ్డి జిల్ల పెద్ద కొడప్‌గల్ మండలం నుండి ఎస్సీ సంక్షేమ పథకాల అమలు కోసం మార్చి 30న హైదరాబాద్‌లోని ఇంద్ర పార్క్ వద్ద నిర్వహించనున్న నిరాహార దీక్షకు భారీగా తరలిరావాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సర్వగల్లా రవీందర్ మాదిగ పిలుపునిచ్చారు. కామారెడ్డి జిల్లా పెద్ద కొడప్‌గల్ మండలం కాటేపల్లి గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ పిలుపునిచ్చారు.రాష్ట్ర అధ్యక్షులు గౌరవ శ్రీ మేడి పాపన్న మాదిగ చేపట్టనున్న నిరాహార దీక్షకు మద్దతుగా, జిల్లా అధ్యక్షుల ఆదేశాల మేరకు మండలంలోని ప్రతి గ్రామం నుండి మాదిగ మరియు మాదిగ ఉపకులాలతో పాటు ఎస్సీ వర్గాలకు చెందిన ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఎస్సీలకు వర్తించే సంక్షేమ పథకాలు పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రకటించిన పథకాలు కేవలం కాగితాలకే పరిమితం అవుతున్నాయని, వాటి లబ్ధి అర్హులైన ప్రజలకు అందడం లేదని ఆయన విమర్శించారు. ముఖ్యంగా "అంబేద్కర్ అభయ హస్తం" వంటి పథకాల ద్వారా ప్రతి దళిత కుటుంబానికి 12 లక్షల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఈ హక్కులను సాధించుకోవాలంటే సమిష్టిగా పోరాడాల్సిన అవసరం ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు పాపయ్య, పీరయ్య, భీమయ్య, సాయిలు, అశోక్, హన్మాండ్లు తదితరులు పాల్గొన్నారు. ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు కూడా పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఎస్సీ సంక్షేమ పథకాల అమలులో జరుగుతున్న లోపాలను సరిదిద్దించేందుకు ఈ నిరాహార దీక్ష కీలకంగా మారనుందని, ప్రజలు ఐక్యంగా ముందుకు వస్తేనే హక్కులు సాధ్యమవుతాయని నాయకులు పేర్కొన్నారు.

## విద్యారంగంపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం
### – టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ ఫైర్




**రాజన్న సిరిసిల్ల జిల్లా మార్చి 21 తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్:** రాష్ట్రంలో విద్యారంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తోందని టిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కంచర్ల రవి గౌడ్ తీవ్రంగా విమర్శించారు. ఈ సందర్భంగా సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని తెలంగాణ భవన్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం ఆటలాడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు.2026--27 బడ్జెట్‌లో విద్యారంగానికి తగిన నిధులు కేటాయించకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి స్పష్టమైన నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నప్పటికీ ప్రభుత్వం వాటిపై దృష్టి సారించకపోవడం దురదృష్టకరమని అన్నారు.విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతులు కల్పించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. వెంటనే విద్యారంగానికి సరిపడా నిధులు కేటాయించి విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.లేకపోతే విద్యార్థులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడతామని కంచర్ల రవి గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఆరెల్లి వినయ్, అడ్డూరి వేణు, వడ్లూరి సాయి, సూర్య, విష్ణు,కోడం వెంకటేశం, గణేష్, సురేష్,రాజు, హబ్బి తదితరులు పాల్గొన్నారు.

## ఆయుధం అక్షరం కమిటీ ఆధ్వర్యంలో కారేపల్లి ఎస్ఐ బైరి గోపి సన్మానం..



**ఖమ్మం మార్చి 21 తెలంగాణ సైన్యం రిపోర్టర్ బోడ రవి:** మండల పరిధిలోని కారేపల్లి పోలీస్ స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ బైరి గోపిని స్థానిక పత్రికల విలేకరులు, ఆయుధం అక్షరం కమిటీ సభ్యులు మర్యాదపూర్వకంగా కలుసుకొని సన్మానించారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాలువా కప్పి గౌరవించారు.ఈ కార్యక్రమంలో నేడు, వేద న్యూస్, తెలంగాణ సైన్యం, భద్రాది న్యూస్, నిజం న్యూస్ , తెలంగాణ గళం, కాకతీయ న్యూస్ పత్రికల ప్రతినిధులు పాల్గొన్నారు.శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణలో పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను విలేకరులు అభినందించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారంలో బైరి గోపి చూపుతున్న చొరవ ప్రశంసనీయమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా బైరి గోపి మాట్లాడుతూ పత్రికారంగం సమాజానికి కీలక స్తంభమని, ప్రజలకు వాస్తవ సమాచారాన్ని చేరవేయడంలో పత్రికల పాత్ర ఎంతో ముఖ్యమని తెలిపారు.కార్యక్రమంలో ఆయుధం అక్షరం కమిటీ సభ్యులు, వివిధ పత్రికల ప్రతినిధులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## మేడ్చల్‌లో ఘనంగా రంజాన్ వేడుకలు
### – ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు



**మేడ్చల్ ,మార్చి 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** పవిత్రమైన రంజాన్ పండుగ సందర్భంగా మేడ్చల్ జిల్లాలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ఎలంపేట మున్సిపాలిటీ పరిధిలోని డబిల్పూర్ గ్రామంలో కాన్సిలర్ మహమ్మద్ రఫీ గారి గృహంలో రంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీకి చెందిన కాన్సిలర్లు, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు. ఉపవాస దీక్షలు పూర్తి చేసుకున్న ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో పండుగను జరుపుకున్నారు.ప్రేమ, శాంతి, సౌభ్రాతృత్వానికి ప్రతీక అయిన రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదర సోదరీమణులకు శుభాకాంక్షలు తెలియజేశారు. సమాజంలో ఐక్యతను పెంపొందించే ఈ పండుగ ప్రతి ఒక్కరికీ ఆదర్శంగా నిలవాలని నాయకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, స్థానిక ప్రజలు మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## వేదమంత్రాల నడుమ ఘనంగా
### కోట మైసమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు



**ఖమ్మం, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** ఖమ్మం జిల్లా సింగరేణి మండలం ఉసిరికాయలపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని శ్రీ కోట మైసమ్మ అమ్మవారి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు భక్తులతో ఆలయం కళకళలాడింది.ఆలయ చైర్మన్ పర్స పట్టాభి రామారావు, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో ప్రాతఃకాల మండప పూజలు, వేద పారాయణాలు నిర్వహించారు. అమ్మవారికి నవకలశ స్థాపనతో పాటు "శ్రీ భ్రమరాంబ సమేత రామలింగేశ్వర స్వామి వారికి మహన్య సపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం" ఘనంగా నిర్వహించారు.అమ్మవారికి జల బిందెలతో అభిషేకం, మహిళల సామూహిక కుంకుమార్చన, మహావిద్య పారాయణం, వివిధ హోమాలు భక్తి శ్రద్ధలతో నిర్వహించబడ్డాయి. అలాగే "శ్రీ మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి, శ్రీ కోట మైసమ్మ అమ్మవారికి ప్రీతిగా శ్రీ మహా త్రిపురసుందరి బ్రహ్మవిద్య మంత్ర హోమం" నిర్వహించారు.100 సంవత్సరాల చరిత్ర కలిగిన కోటగుట్టలో నిర్వహించిన ఈ ఉత్సవాలకు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కుబడులు సమర్పించుకున్నారు.ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి వేణుగోపాలాచార్యులు, ఆలయ అధికారులు పగడాల మోహన్ కృష్ణ, పర్స సాయి లలిత్, అర్చకులు కొత్తలంక కైలాష్ శర్మ, భైరవభట్ల సాయిరాం, కొత్తలంక శంకర్ శర్మ, రాష్ట్ర నాయకురాలు పగడాల మంజుల, పోలంపల్లి సర్పంచ్ ధరావత్ హేమలత బాలాజీ, చిన్న మడంపల్లి సర్పంచ్ బానోత్ పద్మ రూప్లా నాయక్, కాంగ్రెస్ పార్టీ నాయకురాలు బోడ జ్యోతి, ఉష, మాజీ ఎంపిటిసి మూడు జ్యోతి, బోడ గీత, అప్పలరాజు పద్మ, గ్రామస్తులు గుంపిడి నాగేశ్వరరావు, సోషల్ మీడియా కోఆర్డినేటర్ కనకం పవన్ కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

## నర్వ లో సీసీ రోడ్డు పనులకు భూమిపూజ
### -బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి

**మక్తల్, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** నర్వ మండలంలో మంజూరైన సీసీ రోడ్డు పనులకు భూమిపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. మహబూబ్ నగర్ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ కృషితో ఎన్ఆర్ఈజీఎస్ పథకం ద్వారా నర్వ గ్రామానికి సీసీ రోడ్డు మంజూరైంది.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డాక్టర్ బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి పాల్గొని, నర్వ గ్రామంలోని 10వ వార్డులో చిన్న ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులు లక్ష్మి శ్రీనివాస్, పల్లె భాగ్యమ్మ రాంరెడ్డి చేత భూమిపూజ చేయించారు.ఈ సందర్భంగా బంగ్ల లక్ష్మీకాంత్ రెడ్డి మాట్లాడుతూ నర్వ, లంకల్, యాంకీ, ఎల్లంపల్లి, లక్కరదొడ్డి, ఉండేకొడ్ గ్రామాలకు సుమారు ?30 లక్షల నిధులతో సీసీ రోడ్లు మంజూరయ్యాయని తెలిపారు. పంచాయతీ రాజ్ అధికారుల సూచనల మేరకు ఆయా గ్రామాలలో సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యుల సమక్షంలో పనులు ప్రారంభమవుతున్నాయని పేర్కొన్నారు.సీసీ రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని ఆయన అధికారులను కోరారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు అజిత్ సింహ రెడ్డి, ప్రధాన కార్యదర్శి విజయ్ రామ్, నర్వ మాజీ సర్పంచులు డాక్టర్ వెంకటేశ్వర్ రావు, కుర్మా రెడ్డి, సంధ్యా ఆంజనేయులు, జిల్లా కౌన్సిల్ సభ్యులు, గ్రామ పెద్దలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి
### - యూనియన్ నాయకుడు నర్సిములు డిమాండ్



**నారాయణపేట, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 60 వేల గ్రామపంచాయతీ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ ప్రగతిశీల గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర నాయకుడు నర్సిములు డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామపంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.19,000 అమలు చేసి, దానిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన 30 శాతం పిఆర్సి అమలు చేయాలని కోరారు. 2019 నుండి పారిశుద్ధ్య కార్మికులు, వాటర్‌మన్, కారోబార్, డ్రైవర్లు, బిల్ కలెక్టర్లు తదితరులను మల్టీపర్పస్ వర్కర్లుగా గుర్తించి అందరికీ ఒకే విధంగా రూ.8,500 వేతనం ఇవ్వడం చట్టవిరుద్ధమని విమర్శించారు.సుప్రీంకోర్టు, హైకోర్టు తీర్పుల ప్రకారం "సమాన పనికి సమాన వేతనం" అమలు చేయాలని ఆయన స్పష్టం చేశారు. పిఆర్సి కమిషన్ సూచనల మేరకు కనీస వేతనం రూ.19,000గా నిర్ణయించి, దానిపై 30 శాతం పిఆర్సి అమలు చేయాలని డిమాండ్ చేశారు.

## నర్వలో వైన్ షాపుల వద్ద సిట్టింగ్ రూమ్‌ల కొరత



**నర్వ, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** నర్వ మండల కేంద్రంలో వైన్ షాపుల వద్ద ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఏర్పాటు చేయాల్సిన సిట్టింగ్ రూమ్‌లు లేకపోవడంతో మద్యం సేవించే వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.నిబంధనల ప్రకారం వైన్ షాప్ యజమానులు ప్రత్యేక రుసుము చెల్లించి టేబుళ్లు, కుర్చీలు మరియు ఇతర వసతులతో సిట్టింగ్ రూమ్ ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ, ఇక్కడ ఆ విధానం అమలులో కనిపించడం లేదు. నర్వలోని వైన్ షాప్ వెనుక భాగంలో తాత్కాలిక రేకుల షెడ్డు మాత్రమే ఏర్పాటు చేయడం గమనార్హం.సరైన సదుపాయాలు లేకపోవడంతో మద్యం ప్రియులు ఆ షెడ్డు కింద లేదా చెట్ల కింద, రోడ్ల పక్కన మద్యం సేవించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇదే సమయంలో బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై పోలీసులు దాడులు నిర్వహించి జరిమానాలు విధిస్తున్నారు. దీంతో మద్యం సేవించే వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. "షాప్ వద్ద సరైన పర్మిట్ రూమ్ ఉంటే బయట ఎందుకు తాగుతాం?" అని వారు ప్రశ్నిస్తున్నారు.ఇదిలా ఉండగా, గ్రామాల్లో బెల్ట్ షాపులు జోరుగా నడుస్తున్నాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైన్ షాప్‌ల నుంచి ఆటోల ద్వారా మద్యం సరఫరా అవుతోందని స్థానికులు అంటున్నారు. బెల్ట్ షాపుల్లో ఒక్కో బాటిల్‌పై ?10 నుంచి ?20 వరకు అధికంగా వసూలు చేస్తున్నప్పటికీ, వాటిపై సరైన చర్యలు తీసుకోవడం లేదని పేర్కొంటున్నారు.నర్వ మండలానికి రెండు వైన్ షాపులు మంజూరు కాగా, ఒకటి నర్వలో, మరొకటి కల్వల గ్రామంలో నడుస్తున్నాయి. అక్కడ కూడా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. సిట్టింగ్ రూమ్‌లు లేకపోవడంతో ప్రజలు ధాబాలు, చెట్ల కింద మద్యం సేవిస్తున్నారు.ప్రభుత్వ నిబంధనలను అమలు చేయాల్సిన అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో వైన్ షాప్ యజమానులు స్వేచ్ఛగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

## కోటకొండలో ఘనంగా రంజాన్ వేడుకలు



**నారాయణపేట, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో రంజాన్ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ముస్లిం మైనార్టీ సోదరులు తిరుమలాపూర్ గేటు నుండి ఈద్గా వరకు నడుచుకుంటూ వెళ్లి అక్కడ ప్రత్యేక నమాజులు నిర్వహించారు.అనంతరం గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ వెంకట్ రాములు గౌడ్, ఉప సర్పంచ్ చెన్నప్ప యాదవ్ మరియు వివిధ రాజకీయ పార్టీల నాయకులు ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ ఎంపిటిసి వేపూర్ రాములు, మాజీ సర్పంచ్ బి. రాము, మాజీ ఎంపీటీసీ కాశీనాథ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు యాదగిరి పాల్గొన్నారు. పండుగలు ఐక్యతకు నిదర్శనమని, గ్రామంలో అందరూ కలిసికట్టుగా ఉండాలని నాయకులు సూచించారు.కార్యక్రమంలో జామా మసీదు సదర్ పీర్ మైనుద్దీన్, సెక్రటరీ ఇస్మాయిల్, మెంబర్లు రఫీ, లక్ష్మప్ప, రామకృష్ణతో పాటు సిపిఎం పార్టీ నాయకులు బలరాం, దస్తప్ప, మల్లేష్, బీఆర్ఎస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు చెవుల మల్లేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభంజన్ రావు మరియు ముస్లిం మైనార్టీ పెద్దలు, యువకులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు
### - తోటకూర వజ్రేష్ యాదవ్

**మేడ్చల్,మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** రంజాన్ పండుగ పవిత్రతకు, మత సామరస్యానికి ప్రతీక అని మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి, డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పేర్కొన్నారు.కీసరం సర్కిల్ శామీర్‌పేట్ డివిజన్ పరిధిలో తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు ముజీబుద్దీన్, మేడ్చల్--మల్కాజ్గిరి సేవాదళ్ అధ్యక్షుడు మహమ్మద్ షాఫిఉద్దీన్ ఆధ్వర్యంలో ఆయన నివాసంలో నిర్వహించిన రంజాన్ వేడుకల్లో తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ఉపవాసాలు ఆచరించడం ద్వారా సహనం, సేవా భావం, దాతృత్వం పెంపొందుతాయని తెలిపారు. తెలంగాణలో అన్ని మతాల ప్రజలు పరస్పర గౌరవంతో కలిసి పండుగలు జరుపుకోవడం మన సంస్కృతికి నిదర్శనం అని పేర్కొన్నారు. ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్టీ సెల్ చైర్మన్ బిలియా నాయక్, తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ చైర్మన్ జితేందర్ రెడ్డి, సికింద్రాబాద్ డీసీసీ దీపక్ జాన్, మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ నర్సింహా యాదవ్, జిల్లా ఆర్టీఓ సభ్యుడు జైపాల్ రెడ్డి, అలియాబాద్ మున్సిపాలిటీ అధ్యక్షుడు తుంకి రమేష్, మున్సిపల్ చైర్మన్ శిరీష కృష్ణ రెడ్డి, స్థానిక నాయకులు, ముస్లిం మత పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## మునిరాబాద్‌లో చలివేంద్రం ప్రారంభం




**మేడ్చల్, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జీహెచ్ఎంసీ పరిధిలోని కిస్టాపూర్, పూడూర్ డివిజన్‌లోని మునిరాబాద్ గ్రామంలో చలివేంద్రాన్ని ఘనంగా ప్రారంభించారు.ఈ కార్యక్రమాన్ని గూడూరు సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. గ్రామంలోని నాయకులు, కార్యకర్తలు పాల్గొని చలివేంద్రాన్ని ప్రారంభించి, వేసవి కాలంలో ప్రజలకు తాగునీరు అందించే ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగకరమని తెలిపారు.వేసవి తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రం ద్వారా ప్రయాణికులు, స్థానిక ప్రజలు ఉపశమనం పొందుతారని నిర్వాహకులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## కోరుట్లపేటలో ఇద్ కా తోఫా పంపిణీ



**ఎల్లారెడ్డిపేట,మార్చి 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామంలో రంజాన్ పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని ముస్లిం పేద మహిళలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాంప్రదాయాలకు అనుగుణంగా ఈద్ ముబారక్ ఈద్ కా తోఫా లో భాగంగా చీరలను పంపిణీ చేశారు.అనంతరం ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రేవంత్ మిత్ర మండలి జిల్లా అధ్యక్షులు గూడ విజయ్ రెడ్డి, మాజీ సర్పంచ్ మేడిపల్లి దేవానందం,వార్డు సభ్యుడు జల్లి సంతోష్, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## బడ్జెట్‌లో అన్ని వర్గాలకు న్యాయం

### – సాయిపేట శ్రీనివాస్



**మేడ్చల్, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాల ప్రజలను దృష్టిలో ఉంచుకొని సమన్వయం గా ఉందని గుండ్లపోచంపల్లి 299 డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్ అన్నారు. రైతులు, మహిళలు, పేద మరియు మధ్యతరగతి ప్రజలకు ఈ బడ్జెట్ అనుకూలంగా ఉందని తెలిపారు. ఆరోగ్యశ్రీ వంటి పథకాలు, ఇందిరమ్మ బీమా కింద రూ.5 లక్షల పథకం తీసుకువచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

## రంజాన్ వేడుకల్లో మత సామరస్య సందేశం

### - గౌస్ పాషాకు సన్మానం



**ఖమ్మం, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలో మత సామరస్యాన్ని ప్రతిబింబించే కార్యక్రమం నిర్వహించారు. గిరిజన నాయకుడు అజ్మీర వీరన్న ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాజీ మైనారిటీ మండల అధ్యక్షుడు షేక్ గౌస్ పాషాను శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, యువకులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

## కోరుట్లపేటలో ఇద్ కా తోఫా పంపిణీ



**ఎల్లారెడ్డిపేట మార్చి 21 తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్:** రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం కోరుట్లపేట గ్రామంలో రంజాన్ పండుగ పర్వదిననాన్ని పురస్కరించుకొని ముస్లిం పేద మహిళలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాంప్రదాయాలకు అనుగుణంగా ఈద్ ముబారక్ ఈద్ కా తోఫా లో భాగంగా చీరలను పంపిణీ చేశారు.అనంతరం ముస్లిం సోదర సోదరీమణులకు రంజాన్ శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో రేవంత్ మిత్ర మండలి జిల్లా అధ్యక్షులు గూడ విజయ్ రెడ్డి, మాజీ సర్పంచ్ మేడిపల్లి దేవానందం,వార్డు సభ్యుడు జల్లి సంతోష్, సాయి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రేమ, సౌభ్రాతృత్వానికి ప్రతీక రంజాన్

### – బి రాము, కాశీనాథ్





**నారాయణపేట, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** నారాయణపేట మండలం కోటకొండ గ్రామంలో రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం మైనార్టీ సోదరులకు సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి రాము, డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రేమ, నిబద్ధత, దాతృత్వానికి ప్రతీక రంజాన్ పండుగ అని, అలాంటి పండుగను ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో, ఐక్యమతంగా జరుపుకోవాలని సూచించారు.భగత్‌సింగ్ చౌరస్తాలో ముస్లిం సోదరులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసి సేమ్యాలు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు యాదగిరి, భీమేష్, సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ మైనుద్దీన్, జామా మసీదు సదర్ పీర్ మైనుద్దీన్, సెక్రటరీ ఇస్మాయిల్, వార్డు సభ్యుడు పేరపల్లె రఫీ, మాజీ వార్డు సభ్యుడు అబ్దుల్ రెహమాన్, షకూర్, నయీమ్, సాజిద్, మౌలాలి, వహీద్, సాబీర్, రుక్ముద్దీన్, నదీమ్, మహమ్మద్ రఫీ, అనీఫ్ తదితరులు పాల్గొన్నారు.


## నిరుపేద యువతి వివాహానికి సర్పంచ్ చేయూత



**ఎల్లారెడ్డిపేట,మార్చి 21, తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్:**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల గొల్లపల్లి గ్రామానికి చెందిన షకీల్ తన కూతురు వివాహం ఈనెల 23న జరగనుండగా సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ యువతి వివాహానికి రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఆర్థిక సహాయాన్ని అందజేశారు. సర్పంచ్ కొండ రమేష్ కు ఆ కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.అదేవిధంగా ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

## ఘనంగా రాచర్ల కోట దాస ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం





**ఎల్లారెడ్డిపేట, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :**

రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గ్రామంలోని రాచర్ల కోట దాస ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు.గ్రామ పంచాయతీ పాలకవర్గం, ఆలయ భక్తబృందం ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకాలు, చందన సమర్పణ, ఆకుపూజ తదితర పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ కొండాపురం వెంకటరెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా గ్రామంలోని శివ పరాశక్తి పీఠం పీఠాధిపతి మనోహర్ రాజు గురూజీ కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పలు రాజకీయ పార్టీల నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

## ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ ఎమ్మెల్యే ఎస్ రాజేందర్ రెడ్డి



**నారాయణపేట, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :**

నారాయణపేట జిల్లా కేంద్రంలో రంజాన్ పర్వదినాన్ని పురస్కరించుకొని ఈద్గా వద్ద ముస్లిం మైనార్టీ సోదరులకు మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్ రాజేందర్ రెడ్డి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పవిత్ర ఖురాన్ అవతరించిన ఈ మాసం కఠోర ఉపవాస దీక్షలకు ముగింపు వేడుకగా రంజాన్ పండుగను జరుపుకుంటారని పేర్కొన్నారు. చెడు భావనలు, ద్వేషాన్ని తొలగించే గొప్ప పండుగల్లో రంజాన్ ఒకటని అన్నారు.ఈ పవిత్ర మాసం ప్రేమ, దయ, సౌభ్రాతృత్వ గుణాలను పెంపొందిస్తుందని తెలిపారు. ముస్లిం సోదరులు చేసే ప్రార్థనలు, అల్లా దీవెనలతో ప్రజలకు సకల సౌభాగ్యాలు కలగాలని, సకాలంలో వర్షాలు కురవాలని, రైతులకు గిట్టుబాటు ధరలు రావాలని, అన్ని వర్గాల ప్రజలు అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, యువ నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించిన మల్టీ జోన్ -1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి.



**రాజన్న సిరిసిల్ల,మార్చి 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్: :** రాజన్న సిరిసిల్ల జిల్లాకు విచ్చేసిన మల్టీ జోన్ – 1 ఐజీపీ చంద్రశేఖర్ రెడ్డి కి జిల్లా పోలీస్ అధికారులు పూల మొక్కలు అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సాయుధ బలగాలచే గౌరవ వందనం స్వీకరించారు.ఈ సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో జిల్లా పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి,సర్కిల్ వారీగా శాంతి భద్రతల పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, ప్రజలకు భద్రతాభావం కలిగేలా సమర్థవంతంగా విధులు నిర్వహించాలని సూచించారు.పోలీస్ అధికారులు,సిబ్బంది చట్టాలపై లోతైన అవగాహన పెంపొందించుకోవాలని, నమోదు అయిన కేసులలో దర్యాప్తు నాణ్యతను మెరుగుపరుస్తూ ప్రజలకు వేగవంతమైన న్యాయం అందేలా పోలీస్ యంత్రాంగం మరింత సమర్థవంతంగా పనిచేయాలని తెలిపారు.అన్ని పోలీస్ స్టేషన్లలో 5ఎస్ లో భాగంగా రికార్డుల నిర్వహణను సక్రమంగా ఉంచాలని,జిల్లాలో ప్రోయాక్టివ్, విజిబుల్, కమ్యూనిటీ పోలీసింగ్ పై దృష్టి సారించాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలపై, గంజాయి వంటి మాదకద్రవ్యాలపై నిఘాను కఠినతరం చేయాలని ఆదేశించారు.ఇంటి నుండి బయటకు వెళ్లిన ప్రతి వ్యక్తి సురక్షితంగా ఇంటికి చేరే లక్ష్యంతో చేపట్టిన "అరైవ్ అలైవ్" కార్యక్రమాన్ని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని,రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన "ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక"లో భాగంగా అన్ని శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్లాలని తెలిపారు.ఈ సమావేశంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డిఎస్పీ నాగేంద్రచారి, సి.ఐ లు శ్రీనివాస్,నాగేశ్వరరావు,వెంకటేష్, వెంకటేశ్వర్లు,రవి, ఆర్.ఐ లు మధుకర్, రమేష్, యాదగిరి, సురేష్,పాల్గొన్నారు.

## భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాలు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించాలి- పీడీఎస్‌యూ, పీవైఎల్ పిలుపు



**ఖమ్మం, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** ఖమ్మం జిల్లా కారేపల్లి మండల కేంద్రంలో పీడీఎస్‌యూ, పీవైఎల్ ఆధ్వర్యంలో షహీద్ భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్ధంతి సందర్భంగా పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకుడు బానోత్ దేవేందర్, పీవైఎల్ రాష్ట్ర నాయకుడు శివ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా భగత్‌సింగ్ వర్ధంతి కార్యక్రమాలను ప్రజల భాగస్వామ్యంతో ఘనంగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. యువతలో చైతన్యం పెంపొందించేందుకు ప్రతి గ్రామం, ప్రతి విద్యాసంస్థలో విప్లవ వీరుల త్యాగాలను స్మరించుకోవాలని సూచించారు. భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లు దేశ స్వాతంత్ర్యానికి చేసిన త్యాగాలు యువతకు మార్గదర్శకమని పేర్కొన్నారు. విద్య, ఉపాధి హక్కుల కోసం యువత ఉద్యమించాలని పిలుపునిచ్చారు.దేశంలో సామాజిక, ఆర్థిక అసమానతలు పెరుగుతున్నాయని, విద్యా రంగం వ్యాపారంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేయడం వల్ల నిరుద్యోగ సమస్య పెరుగుతోందని విమర్శించారు. కార్యక్రమంలో పీవైఎల్ జిల్లా నాయకుడు గణేష్, పీడీఎస్‌యూ–-పీవైఎల్ నాయకులు ప్రమోద్, రాజేష్, కళ్యాణ్, ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

## నాదర్‌గుల్ కాస్సాగు భూముల వివాదం

### – రైతుల సవాల్ స్వీకరించిన కాంగ్రెస్ నాయకులు



**మహేశ్వరం, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :**మహేశ్వరం నియోజకవర్గం జీహెచ్ఎంసీ బడంగ్‌పేట్ సర్కిల్ పరిధిలోని నాదర్‌గుల్‌లో కాస్సాగు భూముల వివాదం రాజకీయ దుమారాన్ని రేపుతోంది. గత కొంతకాలంగా సుమారు 150 రైతు కుటుంబాలు సాగు చేస్తున్న ఈ భూములపై కోహినూర్ సంస్థ చర్యలకు వ్యతిరేకంగా రైతులు పోరాటం ప్రారంభించారు.తమ భూములను కాపాడాలని రైతులు కాంగ్రెస్ నాయకులను ఆశ్రయించగా, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇంచార్జి కేఎల్ఆర్ స్పందించి శంషాబాద్ జోన్ ఏసీపీతో మాట్లాడి విచారణ జరిపి న్యాయం చేయాలని కోరారు.ఇదిలా ఉండగా, ఈ వ్యవహారంలో కాంగ్రెస్ నాయకులు డబ్బులు వసూలు చేశారన్న బీజేపీ ఆరోపణలను రైతులు ఖండించారు. ఎవరైనా డబ్బులు తీసుకున్నట్లయితే నాదర్‌గుల్ మహంకాళి అమ్మవారి ఆలయంలో ప్రమాణం చేయాలని రైతులు సవాల్ విసిరారు.రైతుల సవాల్‌ను స్వీకరించిన కాంగ్రెస్ నాయకులు మహంకాళి ఆలయానికి చేరుకుని తమపై వచ్చిన ఆరోపణలు నిరాధారమని ప్రమాణం చేశారు. అయితే బీజేపీ నాయకులు కార్యక్రమానికి హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది.రైతులు పలుమార్లు పిలిచినా స్పందించకపోవడంతో బీజేపీ నాయకులపై రైతులు తీవ్ర విమర్శలు గుప్పించారు. ఈ కార్యక్రమంలో భారీ సంఖ్యలో కాస్సాగు రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బడుగు బలహీన వర్గాల కోసం పోరాడిన లింగం గౌడ్

### - 25వ వర్ధంతి నిర్వహణ

**మొయినాబాద్, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** బడుగు బలహీన వర్గాల ఆశయాల కోసం నిరంతరం పోరాడిన నాయకుడు బానోరి లింగం గౌడ్ అని చేవెళ్ల కాంగ్రెస్ లేబర్ సెల్ జనరల్ సెక్రటరీ శివశంకర్ గౌడ్ పేర్కొన్నారు.మొయినాబాద్ మండలంలోని తోల్కట్ట కుదలిలో లింగం గౌడ్ అమరవీరుల స్థూపం వద్ద సీపీఐ ఆధ్వర్యంలో ఆయన 25వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శివశంకర్ గౌడ్ ముఖ్య అతిథిగా పాల్గొని నివాళు లర్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ లింగం గౌడ్ బడుగు బలహీన వర్గాల హక్కుల కోసం పెత్తందారులపై పోరాడిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఆయన ఆశయాలను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.సీపీఐ నాయకులు మాట్లాడుతూ పేద ప్రజలకు అండగా నిలిచి, అన్యాయాలపై పోరాటాలు కొనసాగించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో లింగం గౌడ్ కుటుంబ సభ్యులు, సీపీఐ నాయకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## అంబేద్కర్ సంఘం అధ్యక్షుడి గా గజ్జల సురేష్




**భీమదేవరపల్లి, మార్చి 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** భీమదేవరపల్లి మండలం,వంగర గ్రామంలోని అంబేద్కర్ సంఘం నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.గ్రామ అంబేద్కర్ సంఘం నూతన అధ్యక్షుడిగా గజ్జల సురేష్‌ను గ్రామస్తులు,సంఘం సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.?ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ,గజ్జల సురేష్ కు సంఘం పట్ల ఉన్న నిబద్ధత,సేవా దృక్పథాన్ని పరిగణనలోకి తీసుకుని ఈ బాధ్యతలను అప్పగించినట్లు తెలిపారు.సంఘం అభివృద్ధికి, గ్రామంలోని ఐక్యతను పెంపొందించడానికి సురేష్ కృషి చేస్తారని సభ్యులు విశ్వాసం వ్యక్తం చేశారు.?నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన గజ్జల సురేష్ మాట్లాడుతూ,తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా, గ్రామంలోని ప్రజలందరినీ కలుపుకుంటూ సంఘాన్ని ముందుకు నడిపిస్తానని, సమస్యల పరిష్కారానికి,సామాజిక చైతన్యానికి తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, అంబేద్కర్ సంఘం సభ్యులు, యువజన సంఘాల ప్రతినిధులు గ్రామస్తులు పాల్గొని గజ్జల సురేష్‌ను అభినందించారు.

## రాష్ట్ర బడ్జెట్‌పై ప్రణవ్ బాబు హర్షం



**హుజూరాబాద్, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు సమన్యాయం చేసే విధంగా ఉందని హుజూరాబాద్ కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి వొడితల ప్రణవ్ పేర్కొన్నారు.బడ్జెట్ ఉపాధి, మౌలిక సదుపాయాలు, ఆరు గ్యారెంటీల అమలుకు అనుగుణంగా రూపొందించబడిందని తెలిపారు. కుటుంబానికి జీవిత బీమా పథకం పేద, మధ్యతరగతి ప్రజలకు ఉపయోగకరంగా ఉంటుందని అన్నారు.ప్రజా పాలనలో సుపరిపాలన అందించడమే లక్ష్యంగా బడ్జెట్ రూపొందించారని హర్షం వ్యక్తం చేశారు. ఈ నెల 22 నుండి రైతు భరోసా నిధులు విడుదల అవుతాయని తెలిపారు.

## భార్య మృతిని తట్టుకోలేక ఎస్సై చంద్రశేఖర్ ఆత్మహత్య



**జమ్మికుంట, మార్చి 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :**

కరీంనగర్ జిల్లాలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. కరీంనగర్ టూ టౌన్ ఎస్సై చంద్రశేఖర్ బలవన్మరణానికి పాల్పడ్డారు. ఇటీవల ఆయన భార్య దివ్య ఆత్మహత్య చేసుకోవడం కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది. భార్య మృతిని తట్టుకోలేక తీవ్ర మనస్తాపానికి గురైన చంద్రశేఖర్, ఇల్లందకుంట మండలం సీతంపేటలోని తన అత్తగారింట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు.భార్య దివ్య అంత్యక్రియల సందర్భంగా ఎస్సై చంద్రశేఖర్‌పై గ్రామస్థులు దాడికి ప్రయత్నించినట్లు సమాచారం. అయితే ఆ సమయంలో దివ్య తండ్రి జోక్యం చేసుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చినట్లు తెలిసింది.దివ్య మృతిపై అనుమానాలు తలెత్తిన నేపథ్యంలో మానసిక ఒత్తిడికి గురైన చంద్రశేఖర్ ఈ దారుణ నిర్ణయం తీసుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. సంఘటన అనంతరం చంద్రశేఖర్ మృతదేహాన్ని జమ్మికుంట ఆస్పత్రికి తరలించారు.ఈ ఘటనతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. తల్లిదండ్రుల మరణాలతో ఇద్దరు చిన్నారులు అనాథలుగా మారడం హృదయ విదారకంగా మారింది.

## జిల్లా భూములకు సాగునీరు అందించాలి.

### గట్టు పథకానికి నిధులు కేటాయించాలి.




**గద్వాల, మార్చ్ 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని తెలంగాణ జనసభ కార్యాలయంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో జిల్లా భూములకు సాగునీరు అందించి గట్టు ఎత్తిపోతల పథకానికి నిధులు కేటాయించాలని నాయకులు డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి గోపాల్, టీపీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంకర ప్రభాకర్, పౌరహక్కుల సంఘం అధ్యక్షుడు ఎండి సుభాన్ తదితరులు పాల్గొన్నారు.వారు మాట్లాడుతూ జిల్లాలో ఆర్డీఎస్, జూరాల ప్రాజెక్టులు ఉన్నప్పటికీ భూములకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా గట్టు మండలంలోని ఎడారి భూములు నీటి కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నాయని తెలిపారు.జూరాల ప్రాజెక్టులో లీకేజీలు, మట్టి పూడిక వల్ల నీటి నిల్వ తగ్గుతోందని పేర్కొంటూ, వాటిని వెంటనే పరిష్కరించాలని కోరారు. అలాగే గట్టు ఎత్తిపోతల పథకాన్ని త్వరితగతిన అమలు చేసి రైతులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

## ఇఫ్తార్ లో పాల్గొన్న బ్రహ్మానాయుడు



**పల్నాడు జిల్లా, మార్చి 21,తెలంగాణ సైన్యం డిజిటల్ న్యూస్ :**

మాచర్ల పట్టణంలోని నూర్ మసీద్, మరియు మర్కస్ మసీద్ నందు రంజాన్ సందర్భంగా ఇఫ్తార్ విందును ముస్లిం సోదరులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, వైస్సార్సీపీ పి ఏ సభ్యుడు బొల్లా బ్రహ్మనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.ఈ వేడుకల్లో బ్రహ్మనాయుడితో పాటు వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షులు శ్రీ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి , వై.యస్ఆ.ర్ కాంగ్రెస్ పార్టీ పి ఏ సి సభ్యుడు,నరసరావుపేట మాజీ శాసనసభ సభ్యులు గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి , వారితో పాటు నియోజవర్గ స్థాయి నాయకులు మరియు మండల నాయకులు తదితరులు పాల్గొన్నారు.




### వాతావరణం 20-3-2026

| ప్రాంతం | కనిష్ఠ | గరిష్ఠ |
|---|---|---|
| మెదక్ | 15.8 | 33.6 |
| కరీంనగర్ | 19.0 | 33.0 |
| ఖమ్మం | 19.2 | 35.0 |
| ఆదిలాబాద్ | 19.7 | 34.8 |
| హనుమకొండ | 20.0 | 33.0 |
| నిజామాబాద్ | 20.0 | 33.6 |
| నల్గొండ | 20.2 | 32.0 |
| హైదరాబాద్ | 20.8 | 34.0 |
| రామగుండం | 21.0 | 33.6 |
| మహబూబ్‌నగర్ | 21.5 | 34.1 |
| సూర్యాపేట | 24.0 | 34.0 |
| కడప | 24.0 | 37.0 |
| గుంటూరు | 25.0 | 33.0 |



# అట్టహాసంగా గద్దర్ ఫిల్మ్ అవార్డులు

## సీఎం రేవంత్ చేతుల మీదుగా ప్రదానం

## తారల రాకతో పులకించిన చిత్రసీమ

**టాకీస్:** ఉగాది సందర్భంగా గద్దర్ తెలంగాణ సినీ అవార్డుల వేడుక అంగరంగ వైభవంగా సాగింది. చిత్రసీమ మొత్తం తరలిరావడంతో సంబరాలు అంబరాన్ని అంటాయి. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ సినీ పురస్కారాల్ని ఏర్పాటు చేసి రెండేళ్లుగా ఘనంగా ప్రదానం చేస్తోంది. ఉగాది అనగానే గతంలో తెలుగు ప్రేక్షకులు.. చిత్రసీమ సినీ పురస్కారాల పండగని గుర్తు చేసుకొనేది. పలు కారణాలతో మధ్యలో పద్నాలుగేళ్లపాటు ఈ పురస్కారాలకు నోచుకోలేకపోయింది తెలుగు సినిమా. గతేడాది నుంచి సినిమా రంగంలోని ప్రతిభకు పట్టం కడుతూ... ఉత్తమ చిత్రాల రూపకల్పన కోసం ప్రోత్సాహాన్ని అందించడంలో భాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ సినీ పురస్కారాల్ని ప్రదానం చేస్తోంది. గత ఆనవాయితీ మేరకే ఈసారి ఉగాది సందర్భంగానే గద్దర్ సినీ పురస్కారోత్సవం - 2025 వేడుకని నిర్వహించడం విశేషం. తెలుగు సంవత్సరాది రోజున... పురస్కారాల్ని చేతపట్టి సినీ తారలు, సాంకేతిక బృందాలు, దర్శక నిర్మాతలు మురిసిపోయారు. దక్షిణాది తారలతోపాటు... హిందీ తారలూ ఈ వేడుకలో పాల్గొని ప్రధాన ఆకర్షణగా నిలిచారు.సాంస్కృతిక కార్యక్రమాలు, జ్యోతిప్రజ్వలనతో ప్రారంభమైన ఈ వేడుక ఆద్యంతం సందడిగా సాగింది. అలనాటి తారలు సావిత్రి, శ్రీదేవి, సౌందర్య తదితరుల్ని గుర్తు చేస్తూ... కథానాయిక నిధి అగర్వాల్ వేదికపై చేసిన నృత్యాలు, గాయని మంగ్లీ ఆటాపాట, 'నాగబంధం'లోని నమోరే పాటకు నభా నటేశ్, దక్ష నాగర్కర్ నృత్యాలు, దేవిశ్రీప్రసాద్ హుషారెత్తించేలా పాడిన పాటలు, ఆయన మార్క్ సంగీత ప్రదర్శనలు వేడుకకి ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. తెలుగుసినీ తారలు, పురస్కార గ్రహీతలతోపాటు హిందీ నుంచి వచ్చిన మాధురీ దీక్షిత్, జెనీలియా, రితేశ్ దేశ్‌ముఖ్ సందడితో వేడుక కళకళలాడింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, పర్యటక శాఖమంత్రి జూపల్లి కృష్ణారావు, టీఎఫ్‌డీసీ ఛైర్మన్ దిల్ రాజు, ఎఫ్.డి.సి ఎండీ సీహెచ్ ప్రియాంక తదితరులు విజేతలకు పురస్కారాల్ని ప్రదానం చేశారు. సాయిప్రసాద్ (తండ్రి రమేశ్ ప్రసాద్ బదులుగా, రఘుపతి వెంకయ్య ఫిల్మ్ అవార్డు), సుద్దాల అశోక్ తేజ (సి.నారాయణరెడ్డి ఫిల్మ్ అవార్డు), అశ్వినీ దత్ (నాగిరెడ్డి చక్రపాణి అవార్డు), కమల్‌హాసన్ (సింగీతం శ్రీనివాసరావుకు బదులుగా, బీఎన్ రెడ్డి ఫిల్మ్ అవార్డు) దక్కించుకున్నారు. సిఎంరేవంత్‌రెడ్డి, రామ్‌చరణ్ చేతుల మీదుగా పురస్కారం



స్వీకరిస్తున్న నాగచైతన్య, రష్మిక ఉత్తమ నటి పురస్కారం అందుకోవడానికి వేదికపైకి వచ్చిన రష్మిక మందన్నని 'మా ఊరి కోడలు...' అంటూ యాంకర్ సుమకి పరిచయం చేశారు రేవంత్‌రెడ్డి. పురస్కారం అందుకున్న అనంతరం రష్మిక మాట్లాడుతూ రేవంత్ రెడ్డి చేతులమీదుగా అందుకున్న ఈ పురస్కారం ఎంతో ప్రత్యేకం. రాష్ట్ర ప్రభుత్వం నా నటనని మెచ్చి పురస్కారం ఇచ్చిందని అన్నారు. ఉత్తమ నటుడిగా పురస్కారం అందుకున్న నాగచైతన్య మాట్లాడుతూ 'పదహారేళ్ల సినీ ప్రయాణంలో ఇదెంతో ప్రత్యేకమైన గుర్తింపు. గద్దర్ గొప్ప వ్యక్తి, విప్లవకారుడు. ఆయన పేరు మీద ఏర్పాటు చేసిన ఈ పురస్కారాన్ని అందుకున్నందుకు ఎంతో ఆనందంగా, గర్వంగా ఉందని అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, సీనియర్ కథానాయిక మాధురీ దీక్షిత్ నుంచి ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్న అనంతరం చిరంజీవి మాట్లాడుతూ 'కళాకారులకు ఎక్కడ గౌరవం దక్కుతుందో ఆ రాష్ట్రం, ఆ దేశం, ఆ రాజ్యం సుభిక్షంగా ఉంటుందని నానుడి. దాని అర్థం పరమార్థం గ్రహించి నిర్లక్ష్యానికి గురైన పురస్కారాల్ని మళ్లీ పునరుద్ధరించి, పునరుజ్జీవం పోసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటాం. మేం కలిసిన ప్రతిసారీ సినిమా గురించి, సినిమా అభివృద్ధి గురించే చర్చ ఉంటుంది. తెలుగు సినిమా, దక్షిణ భారత సినిమా అని కాదు, భారతదేశ సినిమాకు హైదరాబాద్‌ని కేంద్రంగా నిలిపేందుకు, ఆ దిశగా తెలుగు చిత్ర పరిశ్రమను అభివృద్ధి చేసేందుకు సమాయత్తం అవుతున్నట్టు ముఖ్యమంత్రి చెప్పారు. గ్లోబల్ సమ్మిట్ జరిగినప్పుడు సినిమాకి ప్రాధాన్యం కల్పించారు. చిత్ర పరిశ్రమకు చెందిన మంచి చెడులు చర్చించి సదుపాయాలు కల్పించేందుకు ముందుకొచ్చారు. సినిమావాళ్లకు అతి దగ్గరగా ఉన్నటువంటి ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గద్దర్ సినీ పురస్కారాల్ని స్ఫూర్తిగా తీసుకొని, ఆ దిశగా ప్రోత్సహిస్తే యువతరం మరిన్ని సినిమాలు చేస్తుంది' అన్నారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, కథానాయకుడు నాగార్జున చేతులమీదుగా అక్కినేని నాగేశ్వరరావు పురస్కారం అందుకున్న జయసుధ మాట్లాడుతూ 'ఏఎన్నార్‌తో ఎన్నో గొప్ప చిత్రాల్లో నటించాను. ఆయన హృదయానికి చికిత్స జరిగిన అనంతరం తిరిగి సినిమాల్లోకి వచ్చినప్పుడు 'ట్రెండ్ మారిపోయింది కదా, నటనలో ఏమైనా మార్పులు చేసుకోవాలా?' అంటూ అప్పుడప్పుడే పరిశ్రమలోకి వచ్చిన నటుడిలా అడిగేవారు. అంత గొప్ప నటుడు అంత సాధారణంగా ఉండటం మా అందరికీ ఓ గొప్ప పాఠం' అన్నారు. కాంతారావు పురస్కారాన్ని అందుకున్న ఆర్.నారాయణమూర్తి మాట్లాడుతూ 'పదమూడేళ్లపాటు సినీ పరిశ్రమ పురస్కారాల కోసం ఎదురు చూసింది. అలాంటిది సూపర్‌స్టార్ కృష్ణ అభిమాని అయిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గతేడాది పురస్కారాల్ని పునః ప్రవేశపెట్టి తెలుగు సినిమా ఉనికిని, కళాకారుల్ని గుర్తించి, గౌరవించినందుకు నా అభినందనలు. గద్దర్ ప్రజా వాగ్గేయకారుడు. ఆయన పేరుపై ఈ పురస్కారాల్ని అందించినందుకు నా సెల్యూట్. ఎన్టీఆర్, ఏఎన్నార్ తర్వాత అంతటి మరో హీరో కాంతారావు. తెలంగాణ గడ్డ బిడ్డ అయిన ఆయన పేరుపై పురస్కారాన్ని నాకు ఇచ్చి జన్మ ధన్యం చేశారు' అన్నారు. బి.ఎన్.రెడ్డి పురస్కారానికి ఎంపికైన సీనియర్ దర్శకుడు సింగీతం శ్రీనివాసరావు తరఫున కమల్‌హాసన్ పురస్కారాన్ని స్వీకరించడం విశేషం. పైడి జయరాజ్ పురస్కారాన్ని అందుకున్న కమల్‌హాసన్ మాట్లాడుతూ 'సింగీతం పురస్కారం అందుకున్నప్పుడు నాకు ఆయన 'సొమ్మొకడిది సోకొకడిది' సినిమా గుర్తుకొచ్చింది. గద్దర్‌కు ఉన్న మిలియన్లకొద్దీ అభిమానుల్లో నేను ఒకడిని. నా సినిమా కెరీర్‌లో నేను కలిసిన అత్యంత యువకుడైన సీనియర్ ఆయన. కవి, విప్లవకారుడైన ఆయన్ను గౌరవిస్తూ ఈ పురస్కారం ఏర్పాటు చేయడంతోనే మా అందరికీ గౌరవం దక్కినట్లైంది.'అన్నారు.


## ఆకట్టుకుంటున్న 'హ్యాపీ రాజ్' ట్రైలర్




**టాకీస్:** 90వ దశకంలో తన స్టైల్ మరియు నవ్వుతో కుర్రకారును ఉర్రూతలూగించిన లవర్ బాయ్ అబ్బాస్ మళ్లీ కెమెరా ముందుకు వచ్చాడు. సుమారు 11 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆయన వెండితెరపై కనిపించబోతున్నారు. జీవీ ప్రకాష్ కుమార్ హీరోగా నటిస్తున్న 'హ్యాపీ రాజ్' చిత్రంతో ఆయన తన సెకండ్ ఇన్నింగ్స్‌ను ప్రారంభిస్తున్నారు. తాజాగా విడుదలైన ఈ చిత్ర తెలుగు ట్రైలర్ ఇప్పుడు సోషల్ మీడియాలో విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ సినిమాలో అబ్బాస్ పాత్ర చాలా కీలకంగా ఉండబోతోంది. హీరోయిన్‌గా తెలుగు నటి శ్రీ గౌరీ ప్రియ నటిస్తుండగా.. ఆమె తండ్రిగా, అమెరికాలో నివసించే 'రాజీవ్' అనే ఎన్నారై పాత్రలో అబ్బాస్ కనిపించబోతున్నాడు. ట్రైలర్‌లో ఆయన లుక్ చూస్తుంటే, ఒకప్పటి 'మిన్నలే' (తెలుగులో 'చెలి') సినిమాలోని అబ్బాస్‌ను గుర్తుకు తెచ్చేలా స్టైలిష్‌గా ఉండటం విశేషం. రాజా ఎలాంచెజియన్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండగా.. ఇదొక క్లీన్ ఫ్యామిలీ ఎంటర్టైనర్ మరియు రొమాంటిక్ కామెడీగా రాబోతుంది. పెళ్లి పీటల వరకు వెళ్లాలనుకునే ఒక జంటకు, వారి కుటుంబాల మధ్య ఎదురయ్యే సరదా సంఘటనలు, ఎమోషన్స్‌తో ఈ సినిమా రూపొందింది. తెలుగు రాష్ట్రాల్లో ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ డిస్ట్రిబ్యూటర్స్ విడుదల చేస్తోంది.

## ఉస్తాద్ భగత్ సింగ్ హిట్ టాక్

### దర్శకుడు హరీష్ శంకర్ ఆనందం



**టాకీస్:** ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా బాగుందన్న అభిప్రాయం రావడం ఎంతో ఆనందాన్నిచ్చిందని దర్శకుడు హరీష్‌శంకర్ అన్నారు. ఆయన దర్శకత్వంలో... పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా తెరకెక్కిన చిత్రం 'ఉస్తాద్ భగత్‌సింగ్'. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, రవిశంకర్.వై సంయుక్తంగా నిర్మించారు. ఈ చిత్రం ఉగాది సందర్భంగా గురువారం విడుదలైంది. ఈ సందర్భంగా చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. దర్శకుడు మాట్లాడుతూ 'పవన్‌కల్యాణ్ అభిమానులు ఫోన్ చేసి 'అన్నా సినిమా చాలా బాగుంది' అంటున్నారు. అన్ని వర్గాల ప్రేక్షకులకూ నచ్చేలా సినిమాని మలిచాం. తొలి రోజు నుంచీ ఓ కమర్షియల్ సినిమా తీస్తున్నానని, ఒకప్పటిలా హుషారైన పవన్‌కల్యాణ్ ఇందులో కనిపిస్తారని చెబుతూ వచ్చా. సినిమా చూసినవాళ్లు ఈ సినిమాలో ఇన్ని అంశాలు ఉన్నాయని మాకు తెలియదంటూ ఆశ్చర్యపోతున్నారు. ఇందులోని ప్రతి పాత్ర బాగా పండింది. అందరికృషితోనే ఇంత మంచి సినిమా చేయగలిగాం అన్నారు. నిర్మాత నవీన్ ఎర్నేని మాట్లాడుతూ థియేటర్ల దగ్గర పండగ వాతావరణం కనిపిస్తోంది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, అమెరికా అనే తేడా లేకుండా అన్ని చోట్లా ప్రేక్షకులు సినిమాని ఆస్వాదిస్తున్నారు. మేం ఊహించిన దానికంటే మంచి స్పందన వచ్చింది. పవన్ కల్యాణ్ వన్ మేన్ షో ఇది. హరీశ్‌శంకర్ ఎంతో బాధ్యతగా 'గబ్బర్‌సింగ్' సినిమాని మించేలా తెరకెక్కించారు. కచ్చితంగా భారీ వసూళ్లు సాధిస్తుందీ చిత్రం' అన్నారు. నిర్మాత రవిశంకర్.వై మాట్లాడుతూ 'పెద్ద హీరో నుంచి వాణిజ్య ప్రధానమైన సినిమా వచ్చి చాలా కాలమైంది. ఇందులో కుటుంబ ప్రేక్షకులు మెచ్చే అంశాలూ ఉన్నాయి. మాకు ఎప్పటికీ గుర్తుండిపోయే ఈ సినిమా విజయంపై మేం సంతోషంగా ఉన్నాం' అన్నారు. ఈ కార్యక్రమంలో కళా దర్శకుడు ఆనంద్‌సాయి, గీత రచయిత చంద్రబోస్ పాల్గొన్నారు.

MOVIE TIME

## కళాకారులకు గౌరవం గర్వకారణం: చిరంజీవి



**టాకీస్:** కళాకారులు గౌరవించబడే చోటు సుభిక్షంగా ఉంటుందన్నది నానుడి. ఈ అవార్డులు అందజేస్తున్న తెలంగాణ ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. సినిమాలు జపాన్, దక్షిణకొరియా దేశాల్లో ఆర్థికంగా ప్రభావం చూపాయి. వాటి జీడీపీ పెరిగింది. సినీరంగం ప్రాముఖ్యతను కేంద్ర ప్రభుత్వం కూడా గుర్తించింది. సినిమాతో రాష్ట్ర ఎకానమీ పెంచుకోవచ్చు. సినీ పరిశ్రమ అభివృద్ధి కోసం ఏ బాధ్యతనైనా స్వీకరిస్తాం' అని చిరంజీవి అన్నారు. తెలంగాణ గద్దర్ ఫిల్మ్ అవార్డుల్లో చిరంజీవి.. ఎన్టీఆర్ జాతీయ పురస్కారం అందుకున్నారు.

## నేను తెలంగాణ కోడలిని.. నా ఫ్యామిలీని జాగ్రత్తగా చూసుకోండి

### గద్దర్ అవార్డుల వేడుకలో రష్మిక భావోద్వేగం

**టాకీస్:** పద్నాలుగేళ్ల సుదీర్ఘ విరామం తర్వాత తెలంగాణ ప్రభుత్వం 'గద్దర్ సినీ పురస్కారాల' పేరుతో పునఃప్రారంభించిన సినీ అవార్డుల వేడుక వరుసగా రెండో ఏడాది కూడా అత్యంత వైభవంగా జరిగింది. ఉగాది పర్వదినం సందర్భంగా నిర్వహించిన ఈ వేడుకలో టాలీవుడ్ నటి రష్మిక మందన్న ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'గర్ల్ ఫ్రెండ్' చిత్రంలో తన అద్భుత నటనకు గాను ఆమె ఉత్తమ నటిగా అవార్డును



అందుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా అవార్డు అందుకున్న అనంతరం రష్మిక ప్రసంగిస్తూ భావోద్వేగానికి గురయింది. "గతంలో నా నటనపై ఎన్నో విమర్శలు వచ్చాయి. సోషల్ మీడియాలో తీవ్రమైన ట్రోల్స్ ఎదుర్కొన్నాను. కానీ ఈరోజు రాష్ట్ర ప్రభుత్వం నా ప్రతిభను గుర్తించి, ఈ గౌరవాన్ని అందించడం నాపై ఉన్న బాధ్యతను పెంచింది. ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా ఈ అవార్డు అందుకోవడం నా జీవితంలో మర్చిపోలేని అనుభూతి" అని ఆమె పేర్కొంది. ఇటీవల టాలీవుడ్ సెన్సేషన్ విజయ్ దేవరకొండను వివాహం చేసుకున్న రష్మిక, తన ప్రసంగంలో చేసిన వ్యాఖ్యలు అందరి హృదయాలను హత్తుకున్నాయి. "ఇప్పటివరకు నన్ను మీ ఇంటి ఆడబిడ్డలా, కూతురిలా ఆదరించారు. కానీ ఇప్పుడు నేను తెలంగాణ కోడలిగా మీ ముందుకు వచ్చాను. నా ఫ్యామిలీని (దేవరకొండ కుటుంబం) మీరందరూ జాగ్రత్తగా చూసుకోండి" అని ఆమె అనగానే సభా ప్రాంగణం మొత్తం హర్షధ్వానాలతో మారుమోగిపోయింది. రష్మిక మాటలకు గ్యాలరీలో ఉన్న విజయ్ దేవరకొండ తల్లి కూడా భావోద్వేగానికి గురి కావడం అక్కడున్న వారిని కదిలించింది.